ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

విశాఖపట్నం

జిల్లా వార్తలు

శనివారం 19 అక్టోబరు 2024





వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో కలెక్టర్లు, ఇతర అధికారులతో నీతి ఆయోగ్ సీఈఓ భేటీ

విన్నపాల వెల్లువ

నగరంలో మంత్రి నారా లోకేశ్ ప్రజా దర్బార్

- భూమి రిజిస్ట్రేషన్ కాకుండా వైసీపీ నాయకుడు అడ్డుకుంటున్నాడంటూ భీమిలి వాసి ఫిర్యాదు
- తమ భూములు ఆక్రమించుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని బర్మా కాందిశీకుల వినతి
- రెగ్యులర్ చేయాలని 2013లో రిక్రూట్ అయిన ఆర్టీసీ డ్రైవర్ల వేడుకోలు
- డిపాజిట్లు తిరిగి ఇప్పించాలని కోరిన అగ్రిగోల్డ్ బాధితురాలు
- ఉద్యోగాల కోసం విజ్ఞాపనలు
- పరిశీలించి న్యాయం చేస్తానని యువనేత హామీ

విశాఖపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):

రెండు రోజుల పర్యటన నిమిత్తం విశాఖ విచ్చేసిన రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్ శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఆయనకు విన్నవించుకున్నారు. ఆయా విజ్ఞాపన పత్రాలను పరిశీలించిన మంత్రి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

భీమిలికి చెందిన నకెళ్ల సోమరాజు భూమి రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన సమస్యను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. తాము కొనుగోలు చేసిన 78 సెంట్ల భూమి రిజిస్ట్రేషన్ కాకుండా వైసీపీ అండతో అక్కరమాని వెంకటరావు ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ ఫిర్యాదు చేశారు. తమ భూములు ఆక్రమించుకుంటున్న, అందుకు మద్దతిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ బర్మా కాందిశీకుల కేంద్రం సంఘం ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. తమకు ఆయా భూముల్లో ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. తమకు ఉపాధి కల్పించాలని, వ్యాపార నిమిత్తం రుణాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. 2013లో రిక్రూట్ అయిన డ్రైవర్లను రెగ్యులర్ చేయాలని కోరుతూ కాంట్రాక్టు ఆర్టీసీ డ్రైవర్లు వినతిపత్రం సమర్పించారు. విశాఖ రీజియన్‌లో 2013లో ఎంపికైన తమను 2022లో విధుల్లోకి తీసుకున్నారని, దీంతో చాలా సర్వీస్ నష్టపోయామని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో తమకు పీఆర్‌సీ కూడా అమలు చేయలేదని, ఉద్యోగ భద్రత లేకపోవడంతో ఆందోళన చెందుతున్నట్టు పేర్కొన్నారు. గతంలో చంద్రబాబునాయుడు అరెస్టు వార్త విని తన భర్త గుండెపోటుతో మరణించారని, దీంతో తమ కుటుంబం ఆధారం లేకుండా పోయిందంటూ అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం కొండపాలేనికి చెందిన ముచ్చకర్ల ధారాలక్ష్మి వాపోయారు. వడ్డాదిలోని కేజీబీవీలో అవకాశం కల్పించి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. అధికారులు చేసిన తప్పుకు తాను ఇబ్బంది పడాల్సి వస్తోందంటూ కె.చిన్నారావు అనే వ్యక్తి మంత్రికి ఫిర్యాదు చేశారు. 2012లో వుడా అనుమతులు ఉన్న 200 గజాల స్థలాన్ని కొనుగోలు చేశానని, 1981లో సొసైటీకి దాఖలైన భూమిని 35 ఏళ్ల తరువాత నిషేధిత జాబితాలో చేర్చారన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం వచ్చిన డబ్బును అగ్రిగోల్డ్‌లో పెట్టానని, ఆ సంస్థ బోర్డు తిప్పేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు శ్రీకాకుళానికి చెందిన గంగాడ కొర్లమ్మ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. తనకు డిపాజిట్ తిరిగి ... మిగతా 6వ పేజీలో



సమస్యలపై మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బర్మా కాందిశీకుల సంఘ నాయకులు



మంత్రి లోకేశ్‌కు తన సమస్యను చెప్పుకుంటున్న ఓ వృద్ధురాలు

విశాఖపై చంద్రబాబుకు అమితమైన ప్రేమ

- నగరానికి పరిశ్రమలు తీసుకువస్తాం
- మంత్రి నారా లోకేశ్

విశాఖపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):

విశాఖపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు అమితమైన ప్రేమ ఉందని, ఇక్కడకు అనేక పరిశ్రమలు తీసుకువస్తామని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టు నూతన భవన సముదాయంలో విశాఖ బార్ అసోసియేషన్ నిర్వహించిన సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. నగరానికి ఐటీ కంపెనీలను, డేటా సెంటర్‌ను ... మిగతా 6వ పేజీలో



మంత్రి నారా లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు. చిత్రంలో ఎంపీ శ్రీభరత్ ఉన్నారు.

ప్రణాళికలో వెనుకబడ్డ విశాఖ రీజియన్

- ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లతో నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం
- త్వరగా పూర్తి చేయాలని సూచన
- వ్యవసాయం, పర్యాటకం, వాణిజ్యం, రవాణా, తదితర అంశాలపై ఆరా

విశాఖపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):

ప్రణాళిక రూపకల్పనలో విశాఖపట్నం రీజియన్ వెనుకబడి ఉందని, త్వరితంగా పూర్తిచేస్తే జనవరిలో నివేదిక విడుదల చేస్తామని నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం సూచించారు. వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఆయన ఇక్కడ రీజియన్ పరిధిలోని విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, ఉభయ గోదావరి జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు తయారుచేసిన ప్రణాళిక, దానికి జోడించిన అంశాలను ఆయన పరిశీలించారు. రీజియన్‌లో సహజ వనరుల లభ్యత, అనుకూల, ప్రతికూల అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. గ్రోత్ హబ్‌లో చేపట్టబోయే ప్రాజెక్టులు, సమగ్ర ప్రణాళికలు, అమలు, తదితర అంశాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వ్యత్యాసాలను కలెక్టర్లు వివరించారు. అభివృద్ధి చోదకాలైన వ్యవసాయం, పర్యాటకం, వస్తు తయారీ, వ్యాపార, వాణిజ్య రంగాలు, ఆర్థిక అంశాలు, రవాణా, పరిపాలన, తదితర విషయాలపై లోతుగా అడిగి తెలుసుకున్నారు. ముంబై, సూరత్, వారణాసి రీజియన్లలో ప్రణాళిక రూపకల్పన చివరి దశలో ఉందని, ఇక్కడ మధ్యలో ఉందని త్వరగా పూర్తిచేయాలన్నారు. సమావేశంలో నీతి ఆయోగ్ కమిటీ సభ్యులతో పాటు కలెక్టర్లు హరేంధిర్ ప్రసాద్, విజయ కృష్ణన్, జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ కమిషనర్లు సంపత్‌కుమార్, విశ్వనాథన్, పోలీస్ కమిషనర్ శంకరబ్రత బగ్చి పాల్గొన్నారు.

ఉక్కు కార్మికులతో అధికారుల భేటీ

- సమ్మె యోచన విరమించాల్సిందిగా సూచన
- తమ డిమాండ్లు పరిష్కరిస్తే ఆలోచిస్తామన్న నేతలు



కార్మిక సంఘ నాయకులతో సమావేశమైన ఉక్కు అధికారులు

6వ పేజీలో

కొలిక్కిరాని తహసీల్దార్ల బదిలీలు

అల్లూరి, మన్యం జిల్లా నుంచి రాని తహసీల్దార్లు

- విశాఖ నుంచి వెళ్లేందుకు ఇద్దరికి అడ్డంకి
- ఒక తహసీల్దారును మన్యానికి పంపాలని కూటమి నేత పట్టు



విశాఖపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):

తహసీల్దార్ల బదిలీల వ్యవహారం ఇంకా కొలిక్కిరాలేదు. ఉత్తరాంధ్రలోని నాలుగు జిల్లాల మధ్య ఆరుగురి తహసీల్దార్ల బదిలీపై సంబంధిత అధికారులు ఎటూ తేల్చడం లేదనే వాదన వినిపిస్తోంది. గత నెల అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి విశాఖకు ఇద్దరిని, విశాఖ నుంచి ఒకరిని, అనకాపల్లి నుంచి ఇద్దరినీ అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ చేశారు. ఇంకా అనకాపల్లి నుంచి ఒకరు విశాఖ రాగా, పార్వతీపురం మన్యం నుంచి ఇద్దరు విశాఖ, అనకాపల్లి జిల్లాలకు వచ్చారు.

అయితే విశాఖపట్నం నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ చేసిన అధికారి పాడేరు వెళ్లేందుకు విముఖత చూపుతూ కోర్టును ఆశ్రయించారు. కలెక్టర్ స్థాయిలో సమస్య పరిష్కరించుకోవాలని కోర్టు సూచించింది. వాస్తవంగా ఆ అధికారి వయస్సు 59 సంవత్సరాలు. ఐటీడీఏ నిబంధనల మేరకు 50 ఏళ్లు దాటిన వారిని ఏజెన్సీకి పంపకూడదు.

ఇక అనకాపల్లి నుంచి ఒకరు అల్లూరి సీతారామరాజు జిల్లాకు వెళ్లకపోవడంతో అక్కడ పనిచేస్తున్న ఇద్దరు తహసీల్దార్లను రిలీవ్ చేయలేదు. ఈ నేపథ్యంలో రెండు నెలల నుంచి మహారాణిపేట తహసీల్దారు పోస్టు ఖాళీగా ఉండిపోయింది. పార్వతీపురం మన్యం నుంచి విశాఖ బదిలీ అయిన అధికారికి కలెక్టరేట్‌లో పోస్టింగ్ ఇవ్వగా ... మిగతా 6వ పేజీలో

రాయితీ నూనెపై గందరగోళం

కేవలం తెల్లకార్డు ఉన్న వారికే విక్రయం

- వాటికి క్యూఆర్ కోడ్ స్కానర్.. ఓటీపీ
- అది కూడా నెలకు ఒక కిలో మాత్రమే...
- అవసరం లేని పామాయిల్ 3 కిలోలు
- రెండూ లోకల్ బ్రాండ్లే
- కొనుగోలుకు ఆసక్తి చూపని జనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వంట నూనెల ధరలు అధికంగా ఉన్నాయని రాయితీపై విక్రయించేందుకు జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలు గందరగోళానికి దారితీస్తున్నాయి. ఇటీవల వంట నూనెల ధరలు భారీగా పెరిగిన సంగతి తెలిసిందే. వాటిని తక్కువ ధరతో ప్రజలకు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో పౌర సరఫరాల శాఖ ఈ బాధ్యత తీసుకుంది.

టమాటా, ఉల్లి వంటివి రైతుబజార్లలో రాయితీ ధరతో విక్రయించినప్పుడు వినియోగదారులు కేవలం ఆధార్ నంబరు చెబితే సరిపోయేది. ఇప్పుడు వంట నూనెకు కొత్త నిబంధనలు పెట్టారు. ఈ రాయితీ నూనెలు కేవలం తెల్లకార్డుదారులకు మాత్రమే ఇస్తామని అధికారులు ప్రకటించారు. అది కూడా నెలకు ఒకసారి మాత్రమే. రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ ఒక కిలో ప్యాకెట్, పామాయిల్ ప్యాకెట్లు మూడు ఇస్తున్నారు. వీటిని శుక్రవారం నుంచే అందుబాటులోకి తీసుకువచ్చారు. అయితే వీటి విక్రయంలో కూడా కొత్త పద్ధతి పెట్టారు. వీటిని కొనాలనుకునేవారు తప్పనిసరిగా తెల్ల రేషన్‌కార్డు తీసుకువెళ్లాలి. ఆయిల్ అమ్మకాలకు ప్రత్యేక కౌంటర్లు పెట్టలేదు. నేరుగా రైతుబజార్ ఈఓ వద్దకు వెళితే...వినియోగదారుడి మొబైల్‌తో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తారు. అందులో రెండు ఆప్షన్లు వస్తాయి. పౌర సరఫరాల శాఖకు చెందిన యాప్‌ను క్లిక్ చేస్తే రేషన్ కార్డు నంబరు అడుగుతుంది. దానిని ఎంటర్ చేస్తే వినియోగదారుడి మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. దానిని కూడా ఎంటర్ చేస్తే తీసుకున్న ఆయిల్‌కు డబ్బులు కట్టాలని మెసేజ్ వస్తుంది. సొమ్ము కడితే ఆయిల్ ప్యాకెట్లు ఇస్తారు. ఇంత ప్రాసెస్ ఉండడంతో వీటిని కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. పైగా రైతుబజార్లలో బియ్యం, ఇతర నిత్యావసర సరకులు అమ్మే దుకాణాలు అనేకం ఉండగా, వాటిని కాదని ఈఓ కార్యాలయంలో వీటిని విక్రయించడం వల్ల ఎవరూ అక్కడకు వెళ్లడం లేదు. తెల్ల రేషన్ కార్డుపైనే ఇస్తామని నిబంధన పెట్టడం ఏమిటనే వాదన కూడా వినిపిస్తోంది.



ఈఓ కార్యాలయంలో పేరుకుపోయిన వంటనూనెల బాక్సులు

అవసరమైనది ఒకటే...లేనివి మూడు

ప్రస్తుతం ప్రతి ఇంట్లో రిఫైన్డ్ ఆయిల్‌నే వాడుతున్నారు. పామాయిల్ వాడకం చాలా తక్కువ. పామాయిల్‌ను వ్యాపారాలు చేసుకునేవారు, కేటరింగ్, పకోడి దుకాణాలు నడిపేవారు మాత్రమే వినియోగిస్తారు. ఇక కుటుంబానికి వంట నూనె నెలకు మూడు, నాలుగు కిలోలు అవసరం. రాయితీపై ఇవ్వాలనుకున్నప్పుడు రిఫైన్డ్ ఆయిల్ నాలుగు ప్యాకెట్లు ఇస్తే సరిపోతుంది. వారు వాడని పామాయిల్ అమ్మడం కూడా దండగే.

అన్నీ లోకల్ బ్రాండ్లే

రైతుబజార్లలో ప్రస్తుతం రాయితీపై విక్రయిస్తున్న రెండు రకాల ... మిగతా 6వ పేజీలో

అర్ధరాత్రి వరకూ హోటళ్లు


- బార్ అండ్ రెస్టారెంట్లు మాత్రం 10 గంటల వరకే...

విశాఖపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):

నగర పోలీస్ కమిషనర్ ఎట్టకేలకు కీలక నిర్ణయం తీసుకున్నారు. నగరంలో అర్ధరాత్రి 12 గంటల వరకూ అన్నిరకాల హోటళ్లు, రెస్టారెంట్లు నడుపుకోవచ్చునని శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఇది తక్షణమే అమలులోకి వస్తుందన్నారు. అయితే బార్లు, వాటికి అనుబంధంగా ఉన్న రెస్టారెంట్లు మాత్రం రాత్రి పది గంటలకే మూసేయాలని స్పష్టంచేశారు.

ఇటీవల జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హోటళ్ల సమయాలపై చర్చ జరిగింది. రాత్రి 11 గంటల తరువాత రైళ్లు వస్తుంటాయని, ఆ సమయంలో ప్రయాణికులు బయటకు వచ్చి ఏమైనా తినాలంటే హోటళ్లన్నీ మూసేసి ఉంటున్నాయని పలువురు పేర్కొన్నారు. నగర సందర్శనకు వచ్చే పర్యాటకులు రాత్రి 10 దాటిన తరువాత తినడానికి ఏమీ దొరకడం లేదన్నారు. దీంతో రాత్రి 12 గంటల వరకు హోటళ్లు, రెస్టారెంట్లు తెరిచి ఉంచుకునేందుకు అనుమతించాలని పలువురు కోరారు. అయితే రౌడీమూకలు, ఆకతాయిలతో సమస్యలు వస్తాయని పోలీసులు వెనకడుగు వేశారు. రాత్రి గస్తీ పెంచి, పర్యాటకులకు అవసరమైనవి అందుబాటులో ఉంచడం వల్ల అభివృద్ధి సాధ్యమని భావించి నిర్ణయం తీసుకున్నారు.

యూట్యూబ్ కుర్రోళ్లు



- ఇప్పటి వరకు 399 వీడియోలు అప్‌లోడ్, 5.28 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు
- హేళన చేసిన వారి నుంచే ప్రశంసలు పొందిన అనంతగిరి యువకులు

- 8వ పేజీలో

వచ్చే నెలలో కేన్సర్ స్క్రీనింగ్

- ఎన్‌సీడీ 3.0 పేరుతో నిర్వహణకు ప్రభుత్వం సన్నద్ధం
- ఇప్పటికే క్షేత్రస్థాయిలో పనిచేసే వైద్య సిబ్బందికి శిక్షణ పూర్తి
- గర్భాశయ, రొమ్ము, నోటి కేన్సర్లు గుర్తింపు
- వచ్చే నెలలో ప్రారంభం



విశాఖపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):

గత కొన్నాళ్లుగా కేన్సర్ కేసులు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. సమస్యను ముందుగా గుర్తిస్తే సకాలంలో మెరుగైన వైద్యం అందించవచ్చునని, తద్వారా మరణాల సంఖ్య తగ్గుతుందని భావిస్తోంది. అందులో భాగంగానే వచ్చే నెల నుంచి కేన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ (ఎన్‌సీడీ) 3.0 పేరుతో ఈ స్క్రీనింగ్‌ను నిర్వహించనున్నది.

కేన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్ కోసం బోధనాస్పత్రులకు చెందిన వైద్యులు ఇప్పటికే శిక్షణ తీసుకున్నారు. వారు జిల్లాలోని 66 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, నగర పరిధిలోని 18 అర్బన్ ... మిగతా 6వ పేజీలో

చెట్టుకొమ్మ తొలగించరేం?



ఎన్‌జీజీఓస్ కాలనీలో విరిగిన చెట్టు కొమ్మ

అక్కయ్యపాలెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల పక్క రోడ్డులో రెండు రోజుల క్రితం ఈదురు గాలికి చెట్టుకొమ్మ విరిగి పడిపోయింది. దీనివల్ల వాహనచోదకులు, పాదచారులు రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం ఉదయం విరిగిన చెట్టు కొమ్మను ఉద్యానవనశాఖ సిబ్బంది ఇప్పటి వరకు తొలగించకపోవడం పట్ల స్థానికులు మండిపడుతున్నారు. ఆ శాఖ సిబ్బంది బాధ్యతారహితంగా విధులు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై విరిగి పడిన చెట్టుకొమ్మను తొలగించాలని కోరుతున్నారు.

ఓపీకి వెళ్లే దారేది?

- కేజీహెచ్‌లో నడకమార్గం మొత్తం వాహనాలే
- అంబులెన్స్ తీయాలన్నా తిప్పలే
- పార్కింగ్ స్థలంలో ప్రైవేటు అంబులెన్స్‌లు

మహారాణిపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లోకి మనుషులు సులభంగా నడుచుకుని రాకపోకలు సాగించలేనంతగా వాహనాలతో నిండిపోతోంది. ఆసుపత్రిలో ఓపీ గేట్ ద్వారా క్యాజువాలిటీకి వచ్చేవారు లోపలకు నడిచి వెళ్లేందుకు దారి ఉండడం లేదు. అంతేకాదు అంబులెన్స్‌లో వచ్చే రోగులను సైతం గేటు బయట నుంచే లోపలకు తోడ్కొని రావలసిన పరిస్థితి నెలకొంది.



బయట ఆక్రమించి ఉన్న ప్రైవేటు అంబులెన్స్‌లు



వాహనాలతో నిండిపోయిన ఓపీ విభాగం

కేజీహెచ్‌లో అవుట్ పేషెంట్ విభాగానికి నిత్యం సుమారు రెండు వేల మంది ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలపై వైద్య చికిత్సల కోసం వస్తుంటారు. ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలను అవుట్ పేషెంట్ విభాగం బయట నిలుపుతున్నారు. దీనితో ఆ ప్రాంతం పూర్తిగా వాహనాలతోనే నిండిపోతోంది. మనుషులు నడవటానికి చిన్న స్థలం కూడా లేనంతగా వాహనాలతో నిండిపోతోంది. అత్యవసర వైద్యం అందించవలసిన రోగులను తీసుకొచ్చే అంబులెన్సులకు సైతం దారి లేక బాధితులను బయట గేటు దగ్గరే దించేయాల్సిన పరిస్థితి ఉంది. అక్కడ నుంచి వీల్‌చైర్ లేదా స్ట్రెచర్‌పై రోగులను ఆసుపత్రి లోపలకు తరలించాల్సి వస్తుంది. దీనితో రోగులు, వారి సహాయకులు అనేక అవస్థలు పడుతున్నారు. ఆసుపత్రికి వచ్చేవారు తమ వాహనాలు బయట పెట్టేందుకు పార్కింగ్ ప్రదేశం లేకుండా పోయింది. బయట వాహనాలు పెడితే ట్రాఫిక్ సిబ్బంది ఫొటోలు తీసి అపరాధ రుసుము విధించి ఆన్‌లైన్ చెల్లింపులు చేయాలంటూ నోటీసు పంపిస్తున్నారు. దీనితో తమ వాహనాలను ఎక్కడ పెట్టుకోవాలో తెలియక లోపలకు తీసుకొస్తున్నారు.

కేజీహెచ్ ప్రధాన ద్వారం నుంచి గోడను ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో బస్టాప్ పక్కనే ఉన్న ప్రదేశాన్ని ప్రైవేటు అంబులెన్స్‌లవారు ఆక్రమించారు. వాటిని అక్కడ నుంచి తొలగించి కేజీహెచ్‌కు వచ్చే వాహనాల పార్కింగ్ స్థలంగా కేటాయిస్తే కొంతవరకు సమస్య పరిష్కారమవుతుందని పలువురు సూచిస్తున్నారు. ఆసుపత్రి అధికారులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ట్రాఫిక్ పోలీసు అధికారులు సమన్వయంతో ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకొని ప్రైవేట్ వాహనాలు, అంబులెన్స్‌లు ఆక్రమించిన స్థలాన్ని కేజీహెచ్‌కు వచ్చే వాహనాల పార్కింగ్‌గా కేటాయిస్తే బాగుంటుందని పలువురు సూచిస్తున్నారు.

ఇసుక స్టాకు పాయింట్లు ఏర్పాటు చేయాలి

- ఏపీపీఎస్‌సీ చైర్మన్‌ను నియమించాలి
- మంగళగిరి సమావేశంలో విశాఖ నేతలు



ఎన్టీఆర్ విగ్రహానికి నమస్కరిస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రజలకు అందుబాటులో ఇసుక లభించేలా స్టాకు పాయింట్లు ఏర్పాటుచేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడను కోరారు. మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిల సమావేశానికి విశాఖ నుంచి పలువురు హాజరయ్యారు. పార్టీ అధ్యక్షుని హోదాలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, భీమిలి, పశ్చిమ ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పి.గణబాబు, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, పెందుర్తి, విశాఖ దక్షిణ ఇన్‌చార్జిలు గండి బాబ్జీ, సీతంరాజు సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విశాఖలో ఇసుక ఇబ్బందులపై గండి బాబ్జీ మాట్లాడారు. ఏపీపీఎస్‌సీ చైర్మన్‌ను వెంటనే నియమించాలని, ఉద్యోగ నియామకాలు చేపట్టేందుకు వీలుంటుందని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. కాగా మంత్రి లోకేశ్ విశాఖలో పర్యటిస్తున్నందున ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సమావేశానికి హాజరుకాలేదు.

అక్రమ కట్టడం తొలగింపు



మురళీనగర్‌లో కట్టడాన్ని తొలగిస్తున్న దేవస్థానం సిబ్బంది

మురళీనగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని 50వ వార్డు మురళీనగర్ గౌరీ సంఘం భవనం నూతన కట్టడాన్ని శుక్రవారం దేవస్థానం అధికారులు, స్క్వాడ్ సిబ్బంది పాక్షికంగా తొలగించారు. కొన్ని సంవత్సరాల నుంచి ఇదే చోట ఉన్న పాత రేకుల తాత్కాలిక షెడ్డును ఇప్పుడు గౌరీ సేవాసంఘం సభ్యులు శాశ్వత కట్టడంగా మారుస్తున్నారు. తమ పాత షెడ్డు ఎదుట ఉన్న దేవస్థానం భూమి కొంత కలిపి కడుతుండడం వివాదానికి దారి తీసింది. పలుమార్లు స్క్వాడ్ సిబ్బంది హెచ్చరించినా, తమ షెడ్డు ఉన్నంత మేరకు అది ప్రైవేటు భూమి అనీ, ముందు 30 అడుగుల రోడుకు, తమ షెడుకు మధ్య ఉన్న దాదాపు 20 గజాల స్థలం మాత్రమే నిర్మాణంలో కలిసిందని గౌరీ సంఘం సభ్యులే దేవస్థానం అధికారుల ఎదుట శుక్రవారం ఒప్పుకున్నారు. ఈ మేరకు డిజిటల్ సర్వే కూడా చేయించినట్లు తెలిపారు. మురళీనగర్ వాకర్స్ పార్క్ నుంచి ఓ సీనియర్ సిటిజన్ ఈ ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని పదే పదే ఫిర్యాదు చేయడంతో చివరికి రాజకీయ ఒత్తిళ్లను పక్కన పెట్టి, శుక్రవారం గౌరీ సంఘం భవనాన్ని దేవస్థానం భూమి కలిసిన మేరకు తొలగించారు. ఈ నిర్మాణానికి కొత్తగా మహా విశాఖ నగరపాలక సంస్థ నుంచి ప్లాన్ అప్రూవల్ తీసుకోలేదని ఫిర్యాదిదారుడు అధికారులకు తెలిపారు. దీంతో సింహాచలం దేవస్థానం సూపరింటెండెంట్ పి.శ్రీనివాసరావు, అధికారులు, పోలీసు కమిషనరు కార్యాలయం నుంచి అయిదుగురు ఎస్కార్ట్ పోలీసులు, దేవస్థానం కమ్యూనిటీ గార్డులు ఉదయం 11 గంటల సమయానికి భవనం వద్దకు చేరుకుని అక్రమ నిర్మాణం తొలగించారు. తిరిగి తమదైన స్థలంలో మాత్రమే నిర్మాణం చేసుకోవాలని సూచించిన దేవస్థానం అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు.

'సమస్యల నుంచి గట్టెక్కించండి'



అధ్వాన్న పరిస్థితులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

జగదాంబ కూడలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్‌లో పాత మున్సిపల్, తాలుకా కార్యాలయాల భవనాలను వినియోగంలోకి తేవాలని గ్రేటర్ 38వ వార్డు ప్రజలు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను కోరారు. శుక్రవారం కూటమి శ్రేణులతో కలసి ఆయన వార్డులో పర్యటించిన సందర్భంగా స్థానికులు పలు అంశాలను ప్రస్తావించి పరిష్కరించాలని ఎమ్మెల్యేను అభ్యర్థించారు. కనకమహాలక్ష్మి అమ్మవారి గుడి మార్గం విస్తరణ, విక్టోరియా ఆసుపత్రి పూర్తి స్థాయిలో ఆధునికీకరణ, పాతనగరం ప్రాంత మహిళల ఆరోగ్య అవసరాలు తీర్చే ఆసుపత్రిలో ప్రధాన ద్వారం వెడల్పు చేయడం, టౌన్‌హాలు భవనాలను బాగుచేసి అందుబాటులోకి తేవడం వంటి అంశాలను లేవనెత్తారు. శిథిలావస్థలో ఉన్న పోలీసు క్వార్టర్లను మళ్లీ నిర్మించాలన్నారు. భూగర్భ మురుగు వ్యవస్థ, కేబుల్, పారిశుధ్యం పూర్తి స్థాయిలో పనిచేసేలా చూడాలని కోరారు. మంచినీటి సరఫరాలో లోపాలను సరిచేయాలని పలుచోట్ల మహిళలు విన్నవించారు. దీనిపై స్పందిన ఎమ్మెల్యే జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడుకు పలు సూచనలు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలన్నారు. ప్రతీ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లిం మత పెద్దల ప్రార్థనలు

పాతనగరం చెంగలరావుపేట జామియా మసీదు నిర్మాణానికి ఆమోదం లభించడంతో శుక్రవారం ముస్లిం మత గురువులు, మసీదు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. జామియా మసీదు ప్రతినిధులు, స్థానిక ముస్లింలు పాల్గొన్నారు.

విన్నపాల వెల్లువ

... 5వ పేజీ తరువాయి

ఇప్పించేలా చేయలంటూ మంత్రిని ఆమె కోరారు. ఇంజనీరింగ్ చదివిన తనకు ఏదైనా ఉద్యోగ అవకాశం కల్పించాలని విశాఖకు చెందిన బత్తుల దుర్గాప్రణీత్ విజ్ఞప్తి చేశారు. బీసీఏ కంప్యూటర్స్, ఎంబీఏ చదివిన తన కుమారుడికి ఉద్యోగ అవకాశం కల్పించాలంటూ విశాఖకు చెందిన అనసూరి మధుసూదనరావు మంత్రిని కోరారు. షెడ్యూల్ కులానికి చెందిన తనకు రేషన్ దుకాణం మంజూరుచేయాలని కంచరపాలెం ప్రాంతానికి చెందిన మోర్ల రాజారావు వేడుకున్నారు. ఆయా ఫిర్యాదులను పరిశీలించిన మంత్రి లోకేష్ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలను మంత్రి కలిసి ఫొటోలు, సెల్ఫీలు దిగారు.

విశాఖపై చంద్రబాబుకు అమితమైన ప్రేమ

... 5వ పేజీ తరువాయి

తీసుకువస్తామన్నారు. విశాఖలో వాతావరణం ప్రశాంతంగా ఉంటుందని, కొన్ని రాజకీయ కారణాల వల్ల తాను మంగళగిరిని ఎంచుకున్నా..నగరాన్ని అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషిచేస్తానన్నారు. మొదటి వంద రోజుల్లో ఒక్క పరిశ్రమనైనా తీసుకువస్తామని మాటిచ్చామని, చెప్పినట్టుగానే టీసీఎస్‌ను రప్పించామన్నారు. 2019లో ఆర్థికంగా అభివృద్ధి చెందిన పట్టణాల జాబితాలో విశాఖ తొమ్మిదో స్థానంలో ఉంటే గత ప్రభుత్వ పాలనలో పదో స్థానానికి పడిపోయిందన్నారు. ఎకనామిక్ యాక్టివిటీ తగ్గిపోయిందని దీనిని పునరుద్ధరిస్తామన్నారు.

విశాఖ ప్రజలు రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ ఇచ్చారు

కుప్పం కంటే మంగళగిరిలో తనకు ఒక్క ఓటైనా ఎక్కువ మెజారిటీ వస్తుందని తన తండ్రితో అన్నానని, కానీ విశాఖ ప్రజలు రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ ఇచ్చారన్నారు. గాజువాక, భీమిలి తరువాత మంగళగిరి మూడో స్థానంలో నిలిచిందన్నారు.

సూక్ష్మక్రిములను అడ్డుకోవడంపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న విక్టోరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషా ప్రసాద్, నర్సింగ్ సిబ్బంది

జగదాంబ కూడలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): శరీరంలో సూక్ష్మక్రిములు ప్రవేశించకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అన్న అంశంపై విక్టోరియా వైద్యులు, నర్సింగ్, పారిశుధ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషా ప్రసాద్ వెల్లడించారు. శుక్రవారం విక్టోరియా (ఘోషా) ఆసుపత్రి సమావేశమందిరంలో జరిగిన ఇంటర్నేషనల్ ఇన్ఫెక్షన్ ప్రివెంట్ కార్యక్రమంలో మాట్లాడారు. మానవ శరీరంలోకి సూక్ష్మక్రిముల ప్రవేశానికి అనేక మార్గాలు ఉన్నాయన్నారు. జనం ఎక్కువగా గుమిగూడిన ప్రదేశాల్లో నోరు, ముక్కు ద్వారా క్రిములు లోపలకు వెళ్తాయి. ఎదుటి వ్యక్తి తుమ్మినా, దగ్గినా, గట్టిగా మాట్లాడినా బాక్టీరియాతో కూడిన శ్వాసకోశ బిందువులు వాయుమార్గంలో మనిషి శరీరంలోకి చేరుతాయన్నారు. చేతులు శుభ్రం చేసుకోవడం ద్వారా క్రిములు శరీరంలోకి వెళ్లకుండా కొంతమేర నియంత్రించవచ్చునన్నారు. ఆపరేషన్ థియేటర్, వార్డుల్లో రోగుల వద్ద విధుల్లో అప్రమత్తంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి? రోగులను తాకినపుడు మాస్కు ధరించడం, శానిటైజర్‌తో చేతులు శుభ్రపరచుకోవడం, ఇంజక్షన్ సూదుల పట్ల అప్రమత్తంగా ఉండడం, సర్జరీ బ్లేడ్లు, ఇతర కోత పరికరాలు తాకే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తామన్నారు. రోగులకు కూడా ఇన్ఫెక్షన్ సోకకుండా ముందస్తు చర్యలపై పూర్తి అవగాహన కలిగిస్తున్నట్లు వెల్లడించారు. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, నాలుగో తరగతి, పారిశుధ్య సిబ్బంది, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

'విశ్వనాథ' సాహిత్యంపై గోష్ఠి



చర్చలో పాల్గొన్న సాహితీవేత్తలు, రచయితలు

సీతంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో విశ్వనాథ సాహిత్య సమాలోచనపై శుక్రవారం చర్చా వేదిక నిర్వహించారు. ఈ చర్చకు గ్రంథాలయ సొసైటీ సహ కార్యదర్శి డాక్టర్ డి.వి. సూర్యారావు అధ్యక్షత వహించగా, డాక్టర్ పేరి రవికుమార్ ముఖ్య వక్తగా విచ్చేసి ప్రసంగించారు. విశ్వనాథ బహుముఖ ప్రతిభను, ఆయన మేధాసంపత్తిని సోదాహరణంగా వివరించారు. పేరాల హరిప్రియ, డాక్టర్ జి.ఇందిర, మేడా మస్తాన్ రెడ్డి, డాక్టర్ ఆతుకూరి వెంకటేశ్వర్లు, చిన సూర్యనారాయణ, డాక్టర్ పేరాల బాలమురళి పాల్గొన్నారు.

ఉక్కు కార్మికులతో అధికారుల భేటీ

- సమ్మె యోచన విరమించాల్సిందిగా సూచన
- తమ డిమాండ్లు పరిష్కరిస్తే ఆలోచిస్తామన్న నేతలు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28న సమ్మెకు కార్మికులు నోటీస్ ఇచ్చిన నేపథ్యంలో శుక్రవారం సంఘాల నాయకులతో ఉక్కు కర్మాగారం అధికారులు సమావేశమయ్యారు. ప్రస్తుత పరిస్థితుల్లో సమ్మెకు దిగవద్దని, దీనివల్ల సంస్థకు మరింత నష్టం జరుగుతుందని సూచించారు. దీనిపై కార్మిక నాయకులు మాట్లాడుతూ ప్రతి నెలా సకాలంలో జీతాలివ్వాలని, హెచ్‌ఆర్‌ఏ పునరుద్ధరించాలని, టౌన్‌షిప్ క్వార్టర్స్‌లో నివాసముంటున్న వారికి విద్యుత్ బిల్లులు తగ్గించాలని డిమాండ్ చేశారు. వీటిపై స్పష్టమైన హామీ ఇస్తే సమ్మెపై పునరాలోచన చేస్తామని పేర్కొన్నారు. ఈ చర్చల్లో సీజీఎం (హెచ్‌ఆర్) జి.గాంధీ, జీఎం (హెచ్‌ఆర్) ఎన్.భాను, సీజీఎం (వర్క్స్) శ్రీధర్, కార్మిక నాయకులు కొమ్మినేని శ్రీనివాసరావు, రామస్వామి, గుమ్మడి నరేంద్ర, సింహాద్రి, కాండ్రేగుల శ్రీనివాసనాయుడు, లక్ష్మణరావు, రాజు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ మాజీ పీవో మృతి బాధాకరం

మహారాణిపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా అభియాన్ మాజీ ప్రాజెక్టు అధికారి బి.శ్రీనివాసరావు మృతి చాలా బాధాకరమని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసేవారంటూ ఆయన చేసిన సేవలను కొనియాడారు.

కొలిక్కిరాని తహసీల్దార్ల బదిలీలు

... 5వ పేజీ తరువాయి

తనను తహసీల్దారుగా నియమించాలని కోరుతున్నారు. అందుకే ప్రస్తుతం పార్వతీపురం మన్యంలోనే ఉండిపోయారు. ఇదిలావుండగా విశాఖ కలెక్టరేట్‌లో పనిచేస్తున్న తహసీల్దారు ఒకరిని విజయనగరానికి బదిలీ చేస్తూ గత నెలలో సీసీఎల్ఏ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఆ అధికారిని పార్వతీపురం మన్యం జిల్లాకు పంపాల్సిందేనని కూటమి సీనియర్ నేత ఒకరు పట్టుబడుతున్నారు. ఎవరు ఎన్ని చెప్పినా సదరు నేత ససేమిరా అనడంతో అధికారులు తలలు పట్టుకున్నారు. ఉత్తరాంధ్రలో ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు సమావేశమైతే తప్ప ఈ సమస్య పరిష్కారం రాదని రెవెన్యూ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అయితే రెండు, మూడు రోజుల్లో పోస్టింగ్స్‌పై ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

వచ్చే నెలలో కేన్సర్ స్క్రీనింగ్

... 5వ పేజీ తరువాయి

హెల్త్ సెంటర్స్‌లో పనిచేసే సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. వీరంతా క్షేత్రస్థాయిలో పనిచేసే ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్‌కు శిక్షణను అందించారు. సిబ్బంది ప్రోగ్రామ్ ప్రారంభమైన తరువాత ఇంటింటికీ వెళ్లి వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈ స్క్రీనింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా రొమ్ము, గర్భాశయ ముఖద్వార, నోటి కేన్సర్లను గుర్తించనున్నారు. కేన్సర్ ప్రాథమిక దశలో ఉండే లక్షణాలపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆయా లక్షణాలు ఎవరికైనా ఉన్నట్టయితే ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్యుల ఆధ్వర్యంలో పరీక్షిస్తారు. అవసరమైతే నమూనాలను సేకరించి జిల్లా ఆస్పత్రికి పంపిస్తారు. గతంలో ఎన్‌సీడీ సర్వేలో భాగంగా 35 ఏళ్లు నిండిన వారికి మాత్రమే ఈ పరీక్షలు నిర్వహించేవారు. తాజా స్క్రీనింగ్ ప్రోగామ్‌లో 18 ఏళ్లు నిండిన వారిని కూడా పరీక్షించనున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించేలా..

కేన్సర్‌ను చాలా వరకు మూడు, నాలుగు దశల్లో గుర్తిస్తుండడంతో మరణాలు పెరుగుతున్నాయి. అదే ముందుగా గుర్తించినట్టయితే మరణాలను తగ్గించడంతోపాటు సాధారణ జీవితాన్ని గడిపే అవకాశాన్ని అందించవచ్చు. ఆ ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ స్క్రీనింగ్ ప్రోగ్రామ్‌కు శ్రీకారం చుడుతోంది. కేన్సర్ ప్రాథమిక దశలో కొన్ని లక్షణాలు కనిపిస్తుంటాయి. వీటిని నిర్లక్ష్యం చేయడం వల్ల తదుపరి దశకు వ్యాధి వెళుతోంది.

క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ పూర్తి చేసి సిద్ధంగా ఉన్నాం

కేన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించేందుకు సిబ్బందికి శిక్షణ పూర్తిచేశాం. పీహెచ్‌సీ వైద్యులతోపాటు ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు కూడా శిక్షణ తీసుకున్నారు. కేన్సర్ కేసులను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. ప్రతి ఒక్కరూ ఈ ప్రోగ్రామ్‌లో భాగం కావాలి. ఇంటికి వచ్చే ఆరోగ్య సిబ్బందికి సహకారాన్ని అందించాలి. సిబ్బంది అడిగే సమాచారాన్ని ఇవ్వడం వల్ల ఎంతో మేలు కలుగుతుంది. సమస్యతో ఉన్న వారిని సకాలంలో గుర్తించడంతోపాటు మెరుగైన వైద్యాన్ని అందించే ఏర్పాట్లు చేస్తాం. **-డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి**

యూజీడీ సమస్యల పరిష్కారం



మురళీనగర్‌లో మురుగు తొలగిస్తున్న కార్మికులు

మురళీనగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ (యూజీడీ) చిందర వందర పనులపై బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నియోజకవర్గంలోని ప్రధాన దారుల్లో పొంగిపొర్లుతున్న మ్యాన్ హోల్ క్యాప్‌ల వద్ద శుభ్రత పనులు చేపట్టారు. శుక్రవారం 50వ వార్డు మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్స్ పార్కు నార్త్ రోడ్డులో నివాసిత కాలనీలో ఇళ్ల ముందు దుర్గంధభరితంగా మారిన మ్యాన్‌హోల్ ట్యాంకుల్ని శుభ్రం చేశారు. యంత్రాలు, సిబ్బంది సాయంతో రోడ్డు మధ్య రాకపోకలకు ఇరకాటంగా మారిన చోట క్యాపుల్ని తెరచి శుభ్రం చేశారు. మాధవధార తాగునీటి సరఫరా విభాగం ఏఈ పర్యవేక్షణలో సిబ్బంది పనులు నిర్వహించారు. మ్యాన్ హోల్ ఎగుడు, దిగుడు నిర్మాణాలు, దెబ్బతిన్న ట్యాంకుల మూతల విషయమై ఇంజనీరింగ్ అధికారుల సాయంతో చర్యలు తీసుకుంటామని ఏఈ తెలిపారు.

ఘనంగా గార్వి షరీఫ్ చందనోత్సవం



ఉత్సవంలో పాల్గొన్న ముస్లింలు

మర్రిపాలెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధి 53వ వార్డు మర్రిపాలెం జాకీర్‌హుస్సేన్‌నగర్‌లోని మజీద్ ఈ అల్ ఖదీర్ ఆధ్వర్యంలో గార్వి షరీఫ్ చందనోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఫజర్ నమాజ్‌ను ఆచరించిన ముస్లింలు మజీద్ ప్రాంగణంలో ఖురాన్ పఠించారు. సాయంత్రం మర్రిపాలెం, గ్రీన్‌గార్డెన్స్, మసీద్‌వీధి తదితర ప్రాంతాల్లో చందనోత్సవ ర్యాలీ నిర్వహించి అనంతరం కాలనీలో ఉన్న హజరత్ గౌస్ పాక్ నిషాని వద్ద ఫాతిహా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మజీద్ కమిటీ అధ్యక్షుడు మున్నా తదితరులు పర్యవేక్షించారు.

రాయితీ నూనెపై గందరగోళం

... 5వ పేజీ తరువాయి

నూనెలు కూడా లోకల్ బ్రాండ్లే కావడం గమనార్హం. నగర ప్రజలు ఎక్కువగా కొనే ఫ్రీడమ్, రుచి గోల్డ్, గోల్డ్ డ్రాప్, సఫోలా వంటివి లేవు. సన్‌సొలైట్ పేరు గల రిఫైన్డ్ ఆయిల్ అమ్ముతున్నారు. ఇకా పామాయిల్ అయితే 'కూల్‌పాల్' బ్రాండ్ అమ్ముతున్నారు. రిఫైన్డ్ ఆయిల్ బ్రాండ్ బయట కిలో ప్యాకెట్ రూ.132 ఉండగా అక్కడ రూ.124కి ఇస్తున్నారు. అయితే ఇవి లోకల్ బ్రాండ్ కావడంతో ఆదరణ లేదు. ఇక పామాయిల్ బయట లీటరు రూ.125 పైనే ఉంది. ఇక్కడ రూ.110కి ఇస్తున్నారు. వీటిని ఎవరూ కొనడం లేదు.

పామాయిల్ పట్టుకపోతున్నారని క్యుఆర్ కోడ్

పామాయిల్ రేటు రైతుబజార్లలో తక్కువగా ఉందని, వ్యాపారులు వచ్చి ఎక్కువ ప్యాకెట్లు తీసుకుపోతున్నారు. దానిని కట్టడి చేయడానికి క్యుఆర్ కోడ్ స్కానింగ్ పెట్టాల్సి వచ్చింది. వినియోగదారులకు అవసరమైన బ్రాండెడ్ సన్‌ఫ్లవర్ రిఫైన్డ్ ఆయిల్‌ని తక్కువ ధరకు ఇవ్వలేమని డీలర్లు చెప్పడం వల్ల లోకల్ బ్రాండ్లు విక్రయిస్తున్న మాట వాస్తవమే. ఆదరణ చూసుకొని తదుపరి చర్యలు తీసుకుంటాం. **-భాస్కర్, జిల్లా పౌరసరఫరాల అధికారి**

'విద్యుత్ భారం రద్దు చేయకపోతే ప్రజా ఉద్యమం'



ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సీతంపేట, అక్టోబరు 18: (ఆంధ్రజ్యోతి): ఎనిమిది వేల కోట్ల రూపాయిల విద్యుత్ భారం రద్దు చేయకపోతే ప్రజా ఉద్యమం తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గంగారావు హెచ్చరించారు. గురుద్వార రోడ్డులోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద విద్యుత్ వినియోగదారులపై ఇంధన సర్దుబాటు, ట్రూ అప్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన గంగారావు మాట్లాడుతూ ప్రజలపై భారాలు వేయబోమని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం 120 రోజులకే విద్యుత్ ట్రూ అప్, ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో భారం మోపడం తగదన్నారు. 'వైసీపీ బాదుడే బాదుడు' అని గతంలో విమర్శించిన కూటమి నాయకులు వచ్చే ఏడాదికి మరో రూ.11,700 కోట్లు భారం వేయడానికి సిద్ధం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో నిత్యావసరాలు, సిమెంట్, ఇసుక, ఐరన్, ఆయిల్ వంటి ధరలు పెంచడమేనా? వంద రోజుల పాలనలోని మంచి ప్రభుత్వమని నిలదీశారు. ఆర్కెఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో స్మార్ట్ మీటర్లు తీసుకువచ్చి ప్రజలపై భారం వేయడానికి పూనుకుందన్నారు. ఇందుకు నిరసనగా నవంబరు 8 నుంచి 15 వరకు ప్రజాపోరు కార్యక్రమం ద్వారా ఇంటింటికీ సీపీఎం వెళ్లి ప్రజలను చైతన్యపరిచి సచివాలయాల వద్ద ధర్నాలు చేపడతామన్నారు. పార్టీ నాయకులు పి.మణి, వి.క్రిష్ణారావు, ఎం.సుబ్బారావు, ఎం.చంటి, యుఎస్ఎన్ రాజు, జి.అప్పలరాజు, సి.వెంకటరావు, చంద్రశేఖర్, ఎం.సూరీడు, త్రినాథరావు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



సత్యనారాయణ

మర్రిపాలెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎయిర్‌పోర్ట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పంజాబ్ హోటల్ దరి రాజీవ్‌నగర్‌లో నివాసముంటున్న గండబోయిన సత్యనారాయణ(70) ఈ నెల 15న సాయంత్రం బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు, బంధువులు పలు ప్రాంతాల్లో వెతికినప్పటికీ అతడి ఆచూకీ తెలియకపోవడంతో ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎయిర్‌పోర్ట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వాహన'దారుల' అవస్థలు

» వర్షాలకు గోతులమయంగా రోడ్లు
» గుంతల్లో నీరు చేరడంతో వాహనచోదకుల ఇక్కట్లు



కూర్మన్నపాలెం : బురద రోడ్లపై వాహనదారుల ఇబ్బందులు

గాజువాక, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పారిశ్రామిక ప్రాంతంలోని రోడ్లన్నీ గోతులమయంగా మారాయి. ప్రధాన రహదారులతో పాటు వీధుల్లోని రహదారులు కూడా గోతులుగా మారాయి. ఎక్కడ ఏ రహదారి చూసినా గోతులు ఏర్పడడంతో ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనంపై ప్రయాణించాలంటే వాహనదారులు హడలిపోతున్నారు. ముఖ్యంగా షీలానగర్ నుంచి లంకెలపాలెం వరకు జాతీయ రహదారి, గాజువాకలో జగ్గు జంక్షన్, వై జంక్షన్ రోడ్లన్నీ గోతులతో నిండిపోయాయి. ఈ మార్గాల్లో వెళ్లే ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు.మూడు రోజుల క్రితం గాజువాక పోలీస్‌స్టేషన్ జంక్షన్ వద్ద గోతుల్లో ద్విచక్ర వాహనం పడిపోగా, వెనక కూర్చున్న వ్యక్తి కింద పడిపోయారు.వెనుక వస్తున్న లారీ అతడిపై నుంచి వెళ్లడంతో ఆవ్యక్తి అక్కడికక్కడే మృతిచెందారు. రోడ్లు బాగా లేకపోవడంతో ఇలాంటి గాజువాక రహదారుల్లో ఇలాంటి ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి. చాలా మంది గాయాల పాలవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో చినుక పడితే గాజువాక ప్రాంతీయులు గతుకుల రోడ్లప్రయాణానికి ఎదురయ్యే ఇబ్బందులు తలచుకొని వణికి పోతున్నారు. నగరంలో ప్రధాన ప్రాంతమైన గాజువాకలో రోడ్ల దుస్థితిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



గాజువాక రహదారులపై గోతులు



కూర్మన్నపాలెం : తటాకాన్ని తలపిస్తున్న ఆటోనగర్ డి ఎక్స్‌పెన్స్ రహదారు

కూర్మన్నపాలెంలో..

కూర్మన్నపాలెం : గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అభివృద్ధి పేరుతో చేపట్టిన రహదారులలో నాణ్యత లోపించడం వలన చిన్నపాటి వర్షాలకు కూడా రహదారులు బురదగా మారి, పెద్ద రాళ్లు తేలి చెరువుల్లా తయారవుతున్నాయి. జీవీఎంసీ 71వ వార్డు ఆటోనగర్ డి బ్లాకు, ఎక్స్‌పెన్స్ వెళ్లే రోడ్లు పూర్తిగా ఛిద్రమయ్యాయి.

తుంగ్లాం, ఆటోనగర్, చట్టివానిపాలెం, యాదవ జగ్గరాజుపేట, కాపు జగ్గరాజుపేటతో పాటు ఆటోనగర్‌లో పలు కర్మాగారాలకు వెళ్లే ఉద్యోగులకు ఇది ప్రధాన రహదారి. ప్రస్తుత వర్షాలతో రోడ్లు రూపు రేఖలు లేకుండా మారిపోయాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో రహదారులు ఇలా దారుణంగా తయ్యారయ్యాయని, కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్ల మరమ్మతుకు చర్యలు చేపట్టాలని కోరారు.

ఇంధన సర్దుబాటు ట్రూ ఆప్ ఛార్జీలు రద్దు

» సీపీఎం డిమాండ్ » చినగంట్యాడ సబ్ స్టేషన్ వద్ద ఆందోళన



చినగంట్యాడ సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

గాజువాక, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇంధన సర్దుబాటు, ట్రూ ఆప్ చార్జీలు రద్దు చేయాలని చినగంట్యాడ సబ్ స్టేషన్ వద్ద శుక్రవారం సీపీఎం గాజువాక జోన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో పెంచిన ఇంధన సర్దుబాటు ట్రూ ఆప్ చార్జీలను ఇప్పుడు కూటమి ప్రభుత్వం వసూలు చేయడం దుర్మార్గమన్నారు. అధిక ధరలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ఇకపై విద్యుత్ చార్జీలు పెంచటం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిత్యావసర సరుకుల ధరలు తగ్గిస్తామని చెప్పారని, కానీ అందుకు భిన్నంగా పరిస్థితి ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా క్రూడాయిల్ తగ్గుతుంటే భారతదేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేంద్రప్రసాద్, సంతోషం, లక్ష్మి, గణేష్, అప్పారావు, రాజు, సత్యవతి పాల్గొన్నారు.

మల్కాపురం : విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ మల్కాపురం, శ్రీహరిపురం సబ్‌స్టేషన్ల వద్ద సీపీఎం నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు మాట్లాడుతూ విద్యుత్ ఇంధనం సర్దుబాటు ట్రూ ఆప్ చార్జీల పేరుతో సామాన్యులపై కరెంట్ చార్జీలు పెంచి, ఆర్థిక భారం మోపడం సరికాదన్నారు. ట్రూ ఆప్ చార్జీల విధానమే తప్పు అని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన తప్పులనే కూటమి కూడా చేస్తుందని విమర్శించారు. వెంటనే విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్. లక్ష్మణమూర్తి, పైడిరాజు, పెంటారావు, ఏ. సత్యారావు, ఆర్. నాగేశ్వరరావు, దుర్గాప్రసాద్, జి. నరేష్, ఎస్. వాసు, బి. శ్రీను, ఎం. కృష్ణారావు, ఏసుబాబు, రాజు, ప్రేమ్ పాల్గొన్నారు.

పాఠశాలలకు శానిటేషన్ మెటీరియల్ పంపిణీ



హెచ్‌ఎంలకు శానిటేషన్ మెటీరియల్ అందజేస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు

పెదగంట్యాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, జూనియర్ కళాశాలలకు శుక్రవారం శానిటేషన్ మెటీరియల్ పంపిణీ చేశారు. ఎంఈవో ఇ.శ్రీనివాసరావు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శానిటేషన్ మెటీరియల్‌ను అందజేశారు. మండలంలో 31 ప్రాథమిక పాఠశాలలు, ఒక అప్పర్ ప్రైమరీ పాఠశాల, రెండు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలు, ఒక హైస్కూల్ ప్లస్-1 పాఠశాల, ఒక జూనియర్ కళాశాల ఉన్నాయి. వీటిల్లో 4,236 మంది విద్యార్థులు ఉన్నారు. వీరి ఆరోగ్యం, పరిశుభ్రత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని రాష్ట్ర విద్యాశాఖ 240 లీటర్ల బౌల్ క్లీనింగ్ లిక్విడ్, 210 లీటర్ల గదుల ఎయిర్ ఫ్రెషనర్, 320 లీటర్ల బాత్‌రూమ్ క్లీనర్ మంజూరు చేసింది. అలాగే గతంలో పుస్తకాలు కొరత ఏర్పడగా, ఇప్పుడు వాటిని పంపిణీ చేసినట్టు ఎంఈవో తెలిపారు.

ఓటుహక్కుపై విద్యార్థులకు అవగాహన



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ శ్రీవలి

అగనంపూడి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యంపై శుక్రవారంఅవగాహన కల్పించారు. గాజువాక తహసీల్దార్ తోట శ్రీవల్లి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో వ్యవస్థ ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును పొంది వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదన రావు, కో-ఆర్డినేటర్ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

అలాగే జీవీఎంసీ 85వ వార్డు పరిధి గొన్న వానిపాలెంలో గల గొన్నా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు ఓటు హక్కుపై పరవాడ తహసీల్దార్ అంబేడ్కర్ అవగాహన కల్పించారు. సమర్థ, నీతిమంతులను ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలంటే ఓటు కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి గొన్న హేమ చంద్‌నాయుడు. ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి, పూర్వ, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

కూటమిదే స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ బాధ్యత

టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు



దీక్ష శిబిరంలో ప్రసంగిస్తున్న లెనిన్‌బాబు

కూర్మన్నపాలెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్టీలు ప్లాంటు రక్షణ బాధ్యత కూటమి ప్రభుత్వానిదే అని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు అన్నారు. శుక్రవారం కూర్మన్నపాలెంలో 1345వరోజు రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న అయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉక్కు కర్మాగార ప్రైవేటీకరణ విషయంలో కాంట్రాక్టు కార్మికులు, ఉక్కు నిర్వాసితులు ఆందోళన చెందవద్దన్నారు. ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో కలపాలని డిమాండ్ చేశారు. స్టీల్ టీఎన్‌టీయూసీ యూనియన్ ప్రధాన కార్యదర్శి నమ్మి సింహాద్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని ఉపసంహరించుకొనేలా చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు. కార్మికుల ఐక్య పోరాటాలతోనే విజయాలు సొంతమవుతాయన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ఉక్కు సంక్షోభానికి కేంద్ర విధానాలే కారణమని, ఉక్కు కార్మికులకు యాజమాన్యం ఇబ్బందులకు గురి చేయటం తగదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ ఎన్నో కుటుంబాలను రోడ్లు పాలు జేసేందుకు ప్రయత్నించటం దుర్మార్గమైన చర్యన్నారు.కార్యక్రమంలో కార్మిక నేతలు గుమ్మడి నరేంద్ర, లక్ష్మణరావు, శివనాగేశ్వరరావు, రఘు ప్రసాద్, అప్పారావు పాల్గొన్నారు.

బర్మా కాలనీలో వైద్య శిబిరం



వైద్యశిబిరంలో పాల్గొన్న శ్రీనివాసరావు

పెదగంట్యాడ, అక్టోబరు 18 : జీవీఎంసీ 76వ వార్డు బర్మా కాలనీలో శుక్రవారం అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గందం శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఈ ఉచిత వైద్యశిబిరం నిర్వహించేందుకు పోర్టు యాజమాన్యం నిర్ణయం తీసుకుందని ప్రకటించారు. బర్మాకాలనీ, పరిసరాలకు చెందిన అనేక మంది ఈ శిబిరానికి వచ్చి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన రోగులకు వైద్యబృందం మందులు అందజేసింది.

60 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : తుంగ్లాంలో వందే భారత్ బ్లడ్ బ్యాంక్, కాకి కుంచారావు మిత్రమండలి సంయుక్తంగా శుక్రవారం మెగా రక్త దాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ప్రారంభించారు. శిబిరంలో 60 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ ఎండీ వినోద్‌బాబు, కొల్లి అప్పలరెడ్డి, కె.కుంచారావు, డి.పాపారావు, కాకి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బియ్యం కార్డు ఉంటేనే పామాయిల్ విక్రయం

ఎన్ఏడీ జంక్షన్,అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాయితీపై పామాయిల్, సన్ ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లు కొనుగోలు చేయాలంటే వినియోగదారులు తప్పనిసరిగా రైస్ కార్డు తీసుకురావాలని మర్రిపాలెం రైతుబజార్ ఈఓ వరహాలు చెప్పారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.రాయితీపై మూడు పామాయిల్ ప్యాకెట్లు రూ. 300, ఒక ప్యాకెట్ సన్ ఫ్లవర్ ఆయిల్ రూ.124లకు విక్రయిస్తున్నామని తెలిపారు. ఆయిల్ ప్యాకెట్లు కావాల్సిన వారు ముందుగా రైస్‌కార్డు చూపించి, మొబైల్ నంబరును ఎస్టేట్ ఆఫీసర్‌కు తెలియజేస్తే క్యూఆర్ కోడ్ ద్వారా ఆయిల్ విక్రయిస్తామని చెప్పారు.

వార్డుల్లో పారిశుధ్యం లోపిస్తే చర్యలు

వేపగుంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : వేపగుంట జోనల్ కార్యాలయం పరిధిలోని శానిటేషన్ కార్యదర్శులు తప్పనిసరిగా వార్డుల్లో పర్యటించి, పారిశుధ్యం పనులను పరిశీలించాలని ఏఎంహెచ్ఓ డాక్టర్ బండారు అప్పలనాయుడు చెప్పారు. శుక్రవారం ఆయన జోనల్ కార్యాలయంలో 91, 92 వార్డుల సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ క్లాప్ వాహనాల పరిశీలన, తడి పొడి చెత్త సేకరణ వంటి వాటిని గమనించాలని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారిని గుర్తించి, జరిమానాలు విధించాలని తెలిపారు. అలాగే ట్రేడ్ ట్యాక్స్ కలెక్షన్ పెంచాలన్నారు. సమావేశంలో శానిటేషన్ సూపర్‌వైజర్ రమణ, శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

దుర్గమాంబ ఆలయంలో పూజలు

అగనంపూడి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. పరసర ప్రాంత గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని పసుపు, కుంకుమలు, చీరలు సమర్పించి పూజలు చేశారు. స్థానిక బొబ్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు ఆలయంలో లలితా పారాయణం, విష్ణు సహస్ర నామా పారాయణాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ చిత్తా గణేశ్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు, తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం రేపు

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 20న అక్కిరెడ్డిపాలెంలో నిర్వహించే ఉచిత మెగా వైద్య శిబిరం వాల్‌పోస్టర్‌ను క్లబ్ సభ్యులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 9 నుంచి అక్కిరెడ్డిపాలెం రామాలయం వద్ద గల కల్యాణ మండపంలో ఈ శిబిరం నిర్వహించనున్నట్టు తెలిపారు. నేత్ర పరీక్షలతో పాటు హృద్రోగ, ఇతర శారీరక సమస్యలకు వైద్య పరీక్షలు ఉచితంగా చేయనున్నట్టు తెలిపారు.

సినిమా గైడ్

● **వేట్టయాన్ :** సంగం, రమాదేవి, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ లక్ష్మి (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాత (తగరపువలస)
● **విశ్వం :** మెలోడి, శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీ నరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాల పట్నం),మోహిని కాంప్లెక్స్ లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
● **జనక అయితే గనక :** శారద, కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
● **మా నాన్న సూపర్‌హీరో :** గోకుల్, మౌర్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
● **శ్వాగ్ :** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
● **దేవర :** జగదాంబ, శరత్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
● **సత్యం సుందరం :** శ్రీరామ

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 47, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 56, బెండకాయలు 28, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 40, బీరకాయలు 36, ఆనపకాయలు 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 32, క్యారెట్ 50 దొండకాయలు 30, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 82, అల్లం (పాతది) 100, బరబటి 38, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 85, గోరుచిక్కుడు 32, దోసకాయ 32, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 150, పొటల్స్ 66, కీరదోస 28, కాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 32, కంద 62, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్యాప్సికం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	115
ఫారం ధర	135
విత్ స్కిన్	234
స్కిన్‌లెస్	250

సీఎం సహాయ నిధికి రూ.79.95 లక్షలు విరాళం



మంత్రి లోకేశ్‌కు చెక్కు అందిస్తున్న వీసీ అధికారులు

విశాఖపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి ఏయూ నుంచి రూ.79,95,116 విరాళం అందించారు. నగరానికి వచ్చిన మంత్రి నారా లోకేశ్‌ను కలిసి ఏయూ వీసీ జి. శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఇఎన్ ధనుంజయరావు శుక్రవారం కలిసి చెక్కును అందించారు. వర్సిటీలోని బోధన, బోధనేతర ఉద్యోగులు, పెన్షనర్లు స్వచ్ఛందంగా విరాళాలు అందించినట్టు వారు మంత్రికి వివరించారు. ఏయూ అనుబంధ కాలేజీలు నుంచి మరో రూ. 50 లక్షలు అందిస్తామన్నారు.



లక్ష్మీనగర్‌లో నూతనంగా నిర్మించిన పార్క్

ప్రారంభోత్సవానికి సిద్ధంగా పంచవటి పార్క్

ఎన్ఏడీ జంక్షన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ బాజీ జంక్షన్ సంత వెనుక నిర్మించిన పంచవటి పార్కు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. 3 దశల్లో దాదాపు రూ. 27 లక్షలతో పార్కును నిర్మించారు. పనులు దాదాపు పూర్తయి, ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. పార్కులో ఏర్పాటు చేయడానికి శ్రీకృష్ణుడి విగ్రహం తీసుకువచ్చారు. దీనిపై వార్డు రెసిడెంట్ ఆదర్శ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పార్కు నిర్మాణం జరిగినప్పుడు అధికారులు బుద్ధుడి విగ్రహం ఏర్పాటు చేస్తామని చెప్పారని, ఇప్పుడు శ్రీకృష్ణుడి విగ్రహం ఎలా పెడుతున్నారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే తమ అభ్యంతరాలను అధికారులకు తెలియజేశారు. స్థానిక కార్పొరేటర్ సామాజికవర్గం కావడంతో ఇలా చేశారన్న కొంతమంది విమర్శిస్తున్నారు. మరికొంతమంది కార్పొరేటర్ మెప్పు కోసం కొందరు అధికారులే ఇలా చేశారన్న వాదన కూడా వినిపిస్తోంది.

గోపాలపట్నంలో రతన్‌టాటా సంతాప సభ

గోపాలపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటాకు గోపాలపట్నం కళాసేవా పీఠం సభ్యులు నివాళి అర్పించారు. గోపాలపట్నంలోని ఆ సంస్థ కార్యాలయంలో శుక్రవారం టాటా సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ దేశ పారిశ్రామిక రంగాన్ని పరుగులు పెట్టించి, ప్రపంచంలో భారతదేశ ఖ్యాతిని చాటిచెప్పిన ఘనత రతన్ టాటాకు దక్కుతుందన్నారు. పారిశ్రామికవేత్తగానే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ తనదైన ముద్ర వేసుకుని ప్రజలు హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు.

మునగాకు పొడి ఎంతో ఉపయోగకరం

గాజువాక, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) :అజీమాబాద్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం మునగాకు పొడి ఉపయోగం గురించి వివరించి, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ మునగాకు ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమన్నారు. ప్రొటీన్, విటమిన్ ఏ, బీ1, బీ2, బీ3, బీ6, సీ విటమిన్‌లు, కాల్షియం, మెగ్నిషియం, పాస్పరస్ వంటి అమూలమైనవి ఈ ఆకులో లభ్యమవుతాయన్నారు. ఎటువంటి అపోహలు లేకుండా మునగాకు ఆహారంలో వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ కార్యకర్త మునీరా తదితరులు పాల్గొన్నారు.

సరిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ....

పెందుర్తి : సరిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా మునగచెట్టు మహిళల ఆరోగ్యానికి తొలి మెట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి శారద, సీడీపీవో నీలవేణి మాట్లాడుతూ మునగ పోషక విలువలు గురించి గర్భిణులకు వివరించారు. మునగ రసం వల్ల తల్లీ బిడ్డ ఆరోగ్యానికి శ్రేష్ఠం అని చెప్పారు. తొలుత అంగన్వాడీ పరిధిలోని గర్భిణీలకు సీమంతాలు నిర్వహించి, పోషకాహార కిట్లు అందజేశారు, అలాగే వెల్ బేబీలకు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మానస, ఎమ్మెఎస్కే ఉష, తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన కారు



కూర్మన్నపాలెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) :రాజమండ్రి నుంచి విశాఖపట్నం వైపు వస్తున్న ఓ కారు అదుపుతప్పి వడ్లపూడి వద్ద ప్రమాదానికి గురైంది. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. అరకులోయకు వెళ్లేందుకు శుక్రవారం ఉదయం నలుగురు కుటుంబ సభ్యులు కారులో వస్తుండగా, వడ్లపూడి జంక్షన్ వద్దకు వచ్చేసరికి వాహనం అదుపు తప్పి శిథిల బ్రిడ్జి స్తంభాలను ఢీకొని అనంతరం కారు యూటర్న్ తీసుకొని బ్రిడ్జి క్రింద డ్రైనేజీలోకి దూసుకుపోయింది. కారులో ఉన్న వారికి ఎటువంటి గాయాలు తగలకపోవడంతో అంతా ఊపిరి పోల్చుకున్నారు. దువ్వాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కారును బయటకు తీశారు.

స్టేషన్ రోడ్డులో వర్షం నీరు తొలగింపు


కూర్మన్నపాలెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షానికి దువ్వాడ రైల్వే స్టేషన్ నాలుగో ప్లాట్‌ఫాం వైపు నాగదేవత కొండ రహదారి స్విమ్మింగ్ పూల్‌ను తలపించటంతో రైలు ప్రయాణికులు, పరిసర గ్రామాల ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను పరిష్కరించాలంటూ దువ్వాడ రైల్వే యూజర్సు అసోసియేషన్ ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన అధికారులు ఆ నీటిని తొలగించి రహదారిని శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకున్నారు.

డీపీవో శ్రీనివాసరావుకు కన్నీటి వీడ్కోలు

కూర్మన్నపాలెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాజమండ్రి జిల్లా పంచాయతీ అధికారిగా పని చేసి గురువారం గుండెపోటుతో మృతి చెందిన బి. శ్రీనివాసరావు మృతదేహానికి ఆయన స్వగ్రామం కూర్మన్నపాలెంలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. శ్రీనివాసరావుకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె డాక్టర్ శ్రావ్య తలకొరివి పెట్టేందుకు ముందుకు రావడంతో శ్రీనివాసరావు సోదరుడు సత్యప్రసాద్ కార్యక్రమాన్ని చేయించారు.

ఆలయంలో దీపారాధన

కూర్మన్నపాలెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 87 వార్డు వడ్లపూడి శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం స్వస్తిక్, త్రిశూలం, శ్రీకనక దుర్గమ్మ ఆకారం బొమ్మలు గీసి వాటిపై దీపాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కార్పొరేటర్ బొండా జగన్, లక్ష్మి, నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు,సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



నిండుకుండలా ఉన్న ముడసర్లోవ రిజర్వాయర్

ముడసర్లోవ కళ

సామర్థ్యం 179 అడుగులు.. ప్రస్తుతం 164.01

ఆరిలోవ, అక్టోబరు 18 : గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ముడసర్లోవ రిజర్వాయర్ జలకళ సంతరించుకొన్నది. ప్రస్తుతానికి నీటిమట్టం 164.01 అడుగులకు చేరినట్టు ఏఈ సురేష్ తెలిపారు. గతంలో 163 అడుగులు నీటి మట్టం ఉండేని తెలిపారు. ఈ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 170 అడుగులుగా పేర్కొన్నారు.

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ



సరస్వతీదేవి విగ్రహం ఆవిష్కరిస్తున్న స్కూలు సిబ్బంది

మద్దిలపాలెం, అక్టోబరు 18 : శివాజీపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయురాలు దుర్గాకుమారి శుక్రవారం సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక విద్య దశ నుంచే విద్యార్థుల్లో భక్తి, ఆధ్యాత్మికత భావన పెంపొందించాలన్నారు. వైశ్యరాజ్ జ్యువెలర్స్ యాజమాన్యం సహకారంతో సరస్వతీ విగ్రహాన్ని స్కూలు ప్రాంగణంలో ఆవిష్కరించామని తెలిపారు. విద్యకు దేవతగా కొలిచే సరస్వతీ విగ్రహాలు ప్రతీ స్కూలులో ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం విద్యార్థులతో సరస్వతీ పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమా గాంధీ, రమణశ్రీ, లలిత, లక్ష్మీ, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

ఉక్కు కార్మికులతో అధికారుల భేటీ

సమ్మె యోచన విరమించాల్సిందిగా సూచన

తమ డిమాండ్లు పరిష్కరిస్తే ఆలోచిస్తామన్న నేతలు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28న సమ్మెకు కార్మికులు నోటీస్ ఇచ్చిన నేపథ్యంలో శుక్రవారం సంఘాల నాయకులతో ఉక్కు కర్మాగారం అధికారులు సమావేశమయ్యారు. ప్రస్తుత పరిస్థితుల్లో సమ్మెకు దిగవద్దని, దీనివల్ల సంస్థకు మరింత నష్టం జరుగుతుందని సూచించారు. దీనిపై కార్మిక నాయకులు మాట్లాడుతూ ప్రతి నెలా సకాలంలో జీతాలివ్వాలని, హెచ్‌ఆర్‌ఏ పునరుద్ధరించాలని, టౌన్‌షిప్ క్వార్టర్స్‌లో నివాసముంటున్న వారికి విద్యుత్ బిల్లులు తగ్గించాలని డిమాండ్ చేశారు. వీటిపై స్పష్టమైన హామీ ఇస్తే సమ్మెపై పునరాలోచన చేస్తామని పేర్కొన్నారు. ఈ చర్చల్లో సీజీఎం (హెచ్‌ఆర్) జి.గాంధీ, జీఎం (హెచ్‌ఆర్) ఎస్.భాను, సీజీఎం (వర్క్స్) శ్రీధర్, కార్మిక నాయకులు కె.శ్రీనివాసరావు, రామస్వామి, గుమ్మడి నరేంద్ర, సింహాద్రి, కాండ్రేగుల శ్రీనివాస నాయుడు, లక్ష్మణరావు, రాజు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

'హిందీ భాషా సాహిత్యాలు-ఒక విమర్శ'పై చర్చాగోష్ఠి ప్రారంభం



సావనీర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

వెంకోజీపాలెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఏయూ హిందీ విభాగం, విశాఖ హిందీ పరిషత్, ఆపది సాహిత్య సంస్థాన్ (అమేధీ)ల సంయుక్త ఆధ్వర్యంలో ఏయూ ఆచార్య జి.సుంద రెడ్డి హిందీ భవన్‌లో శుక్రవారం 'హిందీ బాషా సాహిత్యాలు-ఒక విమర్శ' అంశంపై చర్చాగోష్ఠి ప్రారంభమైంది. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ప్రారంభించారు. అనంతర ఆయన మాట్లాడుతూ హిందీ భాషా ప్రాశస్త్యాన్ని వివరించారు. అందరూ హిందూ భాషను నేర్చుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్, హిందీ విభాగపు అధ్యక్షులు ఆచార్య ఎ.నరసింహారావు సభకు అధ్యక్షత వహించారు. పూర్వ హిందీ విభాగాధ్యక్షులు పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, నార్వే నుంచి వచ్చిన ప్రొఫెసర్ సతీష్‌చంద్ర శుక్లలు విశిష్ఠ అతిథులుగా పాల్గొని ప్రసంగాలు చేశారు. చర్చా గోష్ఠికి సంబంధించిన సావినార్‌ను అతిథులు ఆవిష్కరించారు.

విశాఖపై చంద్రబాబుకు అమిత ప్రేమ

... 5వ పేజీ తరువాయి

తీసుకువస్తామన్నారు. విశాఖలో వాతావరణం ప్రశాంతంగా ఉంటుందని, కొన్ని రాజకీయ కారణాల వల్ల తాను మంగళగిరిని ఎంచుకున్నా..నగరాన్ని అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషిచేస్తానన్నారు. మొదటి వంద రోజుల్లో ఒక్క పరిశ్రమనైనా తీసుకువస్తామని మాటిచ్చామని, చెప్పినట్టుగానే టీసీఎస్‌ను రప్పించామన్నారు. 2019లో ఆర్థికంగా అభివృద్ధి చెందిన పట్టణాల జాబితాలో విశాఖ తొమ్మిదో స్థానంలో ఉంటే గత ప్రభుత్వ పాలనలో పదో స్థానానికి పడిపోయిందన్నారు. ఎకనామిక్ యాక్టివిటీ తగ్గిపోయిందని దీనిని పునరుద్ధరిస్తామన్నారు.

విశాఖ ప్రజలు రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ ఇచ్చారు

కుప్పం కంటే మంగళగిరిలో తనకు ఒక్క ఓటైనా ఎక్కువ మెజారిటీ వస్తుందని తన తండ్రితో అన్నానని, కానీ విశాఖ ప్రజలు రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ ఇచ్చారన్నారు. గాజువాక, భీమిలి తరువాత మంగళగిరి మూడో స్థానంలో నిలిచిందన్నారు.

కొలిక్కిరాని తహసీల్దారు బదిలీలు

... 5వ పేజీ తరువాయి

తనను తహసీల్దారుగా నియమించాలని కోరుతున్నారు. అందుకే ప్రస్తుతం పార్వతీపురం మన్యంలోనే ఉండిపోయారు. ఇదిలావుండగా విశాఖ కలెక్టరేట్‌లో పనిచేస్తున్న తహసీల్దారు ఒకరిని విజయనగరానికి బదిలీ చేస్తూ గత నెలలో సీసీఎల్ఏ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఆ అధికారిని పార్వతీపురం మన్యం జిల్లాకు పంపాల్సిందేనని కూటమి సీనియర్ నేత ఒకరు పట్టుబడుతున్నారు. ఎవరు ఎన్ని చెప్పినా సదరు నేత ససేమిరా అనడంతో అధికారులు తలలు పట్టుకున్నారు. ఉత్తరాంధ్రలో ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు సమావేశమైతే తప్ప ఈ సమస్య పరిష్కారం రాదని రెవెన్యూ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అయితే రెండు, మూడు రోజుల్లో పోస్టింగ్స్‌పై ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

వాణిజ్యానికి 'డొమెస్టిక్' ముసుగు

- చోద్యం చూస్తున్న పౌరసరఫరా విభాగం అధికారులు
- గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది, బాయ్స్, హోటల్ నిర్వాహకుల కుమ్మక్కు?



ఓ హోటల్‌లో యథేచ్ఛగా గృహోపకరణ గ్యాస్ సిలిండర్ వినియోగం



సిలిండర్‌కు ముసుగు వేసి వాడుతున్న దృశ్యం

వెంకోజిపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) :గ్యాస్ వినియోగాన్ని తగ్గించాలి... వీలైతే సబ్సిడీని వదులుకుంటే వేరొకరికి అందిద్దామని టీవీలు, పత్రికలు, కాల్‌సెంటర్లు, రేడియోలో కేంద్ర ప్రభుత్వం ప్రకటనలు చేస్తోంది. డిమాండ్ మేరకు ఉత్పత్తి లేకపోవడంతో సబ్సిడీని అందించలేక నష్టాన్ని కొంత వరకైనా తగ్గించుకోవాలనే ఉద్దేశంతో ప్రజల్లో అవగాహన కల్పిస్తోంది. అయితే పౌరసరఫరా అధికారులు మాత్రం ఈ విషయంలో పూర్తిగా కళ్లకు గంతలు కట్టుకుని వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాణిజ్య అవసరాలకు ఉపయోగించేందుకు 19 కిలోల సిలిండర్లను గ్యాస్ కంపెనీలు పంపిణీ చేస్తున్నాయి. కానీ డీలర్లు మాత్రం గృహోపకరణాలకు తయారు చేసిన 16 కిలోల గ్యాస్ సిలిండర్లను వ్యాపారస్తులకు బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కో ఇంటికి ఏడాదికి 12 సిలిండర్లను అందిస్తున్నాయి. ఆ సంఖ్య దాటితే రాయితీయేతర ధరను చెల్లించాల్సి ఉంటుంది. ఒక పక్క ప్రజలకు సరిపడా గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వాలు అందజేయలేకపోతున్నాయి.

మరో పక్క వాణిజ్య అవసరాలకు వినిగించాల్సిన గ్యాస్ సిలిండరు రూ.1600 నుంచి రూ.1800 వరకు ధర ఉండటంతో వ్యాపారులకు గ్యాస్ డెలివరీ బాయ్‌లు వంటగ్యాస్‌లను బ్లాక్‌లో రూ.1200 నుంచి రూ.1300 వరకు అందజేస్తున్నారు. దీంతో వాణిజ్య గ్యాస్ వినియోగానికి బదులుగా వ్యాపారులు గ్యాస్ ఏజెన్సీలతో కుమ్మక్కై గృహోపకరణ గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్నారు. దీనివల్ల ప్రజలకు సాధారణ వంట గ్యాస్ సిలిండర్ల కొరత ఎదురవుతోంది. నగరంలో కొన్ని చోట్ల గ్యాస్ బుక్ చేసిన 15 రోజులు తరువాత గాని సిలిండర్ ఇంటికి రావడం లేదు. వాణిజ్య అవసరాలకు వినియోగించాల్సిన సిలిండర్లు ఏజెన్సీల గోదాముల్లో కుప్పలుగా ఉన్నా అటు వ్యాపారులు, ఇటు ఏజెన్సీ వారు గృహోపకరణాల గ్యాస్ సిలిండర్లను అక్రమ మార్గంలో వినియోగించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద పార్లర్లలో సైతం గృహోపకరణ గ్యాస్ సిలిండర్లనే వాడడం చూస్తోంటే పౌరసరఫరా అధికారులు ఏం చేస్తున్నట్టు అని పలువురు ప్రశ్నిస్తున్నారు. నగరంలో పలు చోట ఇదే పద్ధతి కొనసాగుతున్నా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇటువంటి వ్యాపారులు, వారికి సరఫరా చేస్తున్న ఏజెన్సీల పట్ల దాడులు నిర్వహించి, చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

☛ సంక్షిప్తంగా..

సినర్జీస్ కార్మికులకు జీతాలు చెల్లించాలి

- సీఐటీయూ డిమాండ్

మద్దిలపాలెం, అక్టోబరు 18 : సినర్జీస్ కంపెనీ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ డిమాండ్ చేశారు. పీఠాపురంకాలనీ సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దువ్వాడలో ఉన్న సినర్జీస్ కంపెనీలో కార్మికులకు ఆరు నెలల నుంచి జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. జీతాలు చెల్లించాలని కంపెనీ కార్మికులు గత మూడు రోజుల నుంచి ఆందోళన చేపట్టినా యాజమాన్యం పట్టనట్టు వ్యవహరిస్తోందన్నారు. కార్మికుల జీతాలు చెల్లించి వారి న్యాయమైన కోరికలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు అతి తక్కువ వేతనాలు చెల్లించి సినర్జీస్ లాభాలు ఆర్జిస్తోందన్నారు. అయినా నెలలు కొద్ది జీతాలు ఇవ్వకుండా కార్మికులకు ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. జీతాలు ఇవ్వకపోతే కార్మికుల కుటుంబాలు ఏ విధంగా బతుకుతాయని ప్రశ్నించారు. కార్మిక చట్టాలు ఉల్లంఘిస్తూ వేతనాలు ఇవ్వని సినర్జీస్ సంస్థపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

జాతీయ స్థాయి లైవ్ కాంపిటీషన్‌లో 'బాల్యం' విద్యార్థుల ప్రతిభ

- ముగ్గురు విద్యార్థిలకు జాతీయ స్థాయి అవార్డులు



విద్యార్థులు, తల్లిదండ్రులను అభినందిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ

వెంకోజీపాలెం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : ఢిల్లీకి చెందిన 'చైల్డ్ డ్రీమ్ బూస్టర్ హబ్' సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన లైవ్ కాంపిటీషన్లో ఉత్తమ ప్రతిభనుకనబరచడం ద్వారా జీవీఎంసీ బాల్యం విద్యా కేంద్రాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు మూడు జాతీయ స్థాయి అవార్డులు పొందడం అభినందనీయమని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ప్రశంసించారు. అవార్డులు పొందిన విజేతలకు శుక్రవారం ఆమె తన చాంబర్లో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మతో కలిసిఅభినందించారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా నడపబడుతున్న బాల్యం విద్యాకేంద్రాల్లో విద్యను అభ్యసిస్తున్న ముగ్గురు బాల్యం విద్యార్థులు ఇటీవల జరిగిన జాతీయ స్థాయి లైవ్ కాంపిటీషన్‌లో తమ ఉత్తమ ప్రతిభను కనబరిచారని చైల్డ్ డ్రీమ్ బూస్టర్ హబ్ ఢిల్లీ నిర్వాహకులు ధ్రువీకరించారన్నారు. మొత్తం దేశంలో 18 రాష్ట్రాలకు సంబంధించి 86 జిల్లాల నుంచి 543 మంది 3 నుంచి 5 సంవత్సరాల విద్యార్థులతో చేపట్టిన ఈ జాతీయ స్థాయి లైవ్ కాంపిటీషన్‌లో దత్తి తనుశ్రీ (4), తారకరామ నగర్ బాల్యం కేంద్రం, 'పద్యాలు, పాటల' కేటగిరిలో విజేతగా నిలిచినట్టు చెప్పారు. అలాగే కొల్లా బత్తుల సోనిక (4) కప్పరాడ బాల్యం కేంద్రం, 'శ్లోక పఠనం' కేటగిరిలో సూపర్ పెర్ఫార్మర్‌గా నిలిచినట్టు చెప్పారు. కొడమంచిలి కావ్విక (4) శివాలయం బాల్యం కేంద్రం 'పద్య పఠనం' కేటగిరీలో సూపర్ పెర్ఫార్మర్‌గా నిలిచారు. కార్యక్రమంలో ఎడ్యుకేషన్ విభాగం సూపరింటెండెంట్ చిన్నమ్మలు, బాల్యంఅధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాక్ కమిటీ కృష్ణా కళాశాల సందర్శన



నాక్ కమిటీకి స్వాగతం పలుకుతున్న పూర్వ విద్యార్థులు

మద్దిలపాలెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శుక్రవారం నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (ఎన్ఏఏసీ) బృందం సందర్శించింది. డాక్టర్ ప్రగ్నేశ్ షా, డాక్టర్ హరిశ్చంద్ర రమణ, డాక్టర్ గౌరీశంకర్ బంద్యోపాధ్యాయ్ కళాశాల నిర్వహణను తనిఖీ చేశారు. బోధన పద్ధతులు, ఫలితాల శాతాన్ని అడిగి పరిశీలించారు. పరిశుభ్రత, పచ్చదనం ఎంతమేర పాటిస్తున్నారో ఆరా తీశారు. పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థులు, పేరెంట్స్ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. కళాశాల యాజమాన్యంతో కలిసి పని చేస్తున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు, బయట వారికి ప్రవేశం లేకుండా గేట్లు ఏర్పాటు, మరుగుదొడ్ల మరమ్మతులను కళాశాల యాజమాన్యంతో కలిసి చేపట్టినట్టు పేరెంట్స్, పూర్వవిద్యార్థులు వివరించారు. వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థుల సహకారంతో మరింత అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయబాబు, పూర్వ విద్యార్థులు, పేరెంట్స్ కమిటీ నిర్వహకులు సమయం హేమంత్‌కుమార్, జి.అరుణ్ కుమార్, విజయప్రతాప్, రాపేటి వెంకటరమణ, సూర్యప్రకాష్, సునీత పాల్గొన్నారు.

లబ్ధిదారులకు త్వరితగతిన పెండింగ్ రుణాలు

- జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి

వెంకోజీపాలెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలో గల పట్టణ పేద ప్రజలకు ప్రభుత్వ పథకాలను సంబంధించి రుణాలను త్వరితగతిన లబ్ధిదారులకు అందించేందుకు బ్యాంకర్లు సహకరించాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి బ్యాంకర్లను కోరారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో బ్యాంకర్లతో సమావేశాన్ని యుసీడీ-పీడీ సత్యవేణితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ పీఎంస్వనిధి, పీఎం విశ్వకర్మ, ఏపీ టిట్కో హౌసింగ్ లోన్స్, వన్ సెంట్ ఎస్‌హెచ్‌జీ లోన్స్, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం తదితర పథకాలకు సంబంధించిన అంశాలపై చర్చించి, బ్యాంకర్లు బ్యాంకులో పెండింగ్‌లో ఉన్న పథకాలకు సంబంధించి అన్ని లోన్ అప్లికేషన్లను వెంటనే మంజూరు చేసి లబ్ధిదారులకు లబ్ధి చేకూరే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్టు అధికారులు డి.లక్ష్మి, బి.రమణమ్మ, డీపీఓ కనకమహాలక్ష్మి, ఏపీడీలు, టీపీఆర్వోలు, జీవీఎంసీ పరిధిలోని అన్ని బ్యాంకుల ప్రతినిధులు, సీనియర్ అధికారులు, యూసీడీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో కేన్సర్ స్క్రీనింగ్

... 5వ పేజీ తరువాయి

హెల్త్ సెంటర్స్‌లో పనిచేసే సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. వీరంతా క్షేత్రస్థాయిలో పనిచేసే ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్‌కు శిక్షణను అందించారు. సిబ్బంది ప్రోగ్రామ్ ప్రారంభమైన తరువాత ఇంటింటికీ వెళ్లి వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈ స్క్రీనింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా రొమ్ము, గర్భాశయ ముఖద్వార, నోటి కేన్సర్లను గుర్తించనున్నారు. కేన్సర్ ప్రాథమిక దశలో ఉండే లక్షణాలపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆయా లక్షణాలు ఎవరికైనా ఉన్నట్టయితే ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్యుల ఆధ్వర్యంలో పరీక్షిస్తారు. అవసరమైతే నమూనాలను సేకరించి జిల్లా ఆస్పత్రికి పంపిస్తారు. గతంలో ఎన్‌సీడీ సర్వేలో భాగంగా 35 ఏళ్లు నిండిన వారికి మాత్రమే ఈ పరీక్షలు నిర్వహించేవారు. తాజా స్క్రీనింగ్ ప్రోగామ్‌లో 18 ఏళ్లు నిండిన వారిని కూడా పరీక్షించనున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించేలా..

కేన్సర్‌ను చాలా వరకు మూడు, నాలుగు దశల్లో గుర్తిస్తుండడంతో మరణాలు పెరుగుతున్నాయి.ముందుగా గుర్తించినట్టయితే మరణాలను తగ్గించడంతోపాటు సాధారణ జీవితాన్ని గడిపే అవకాశాన్ని అందించవచ్చు. ఆ ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ స్క్రీనింగ్ ప్రోగ్రామ్‌కు శ్రీకారం చుడుతోంది. కేన్సర్ ప్రాథమిక దశలో కొన్ని లక్షణాలు కనిపిస్తుంటాయి. వీటిని నిర్లక్ష్యం చేయడంతో తదుపరిదశకు వ్యాధి వెళుతోంది.

క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ పూర్తి చేసి సిద్ధంగా ఉన్నాం

- డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి

కేన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించేందుకు సిబ్బందికి శిక్షణ పూర్తిచేశాం. పీహెచ్‌సీ వైద్యులతోపాటు ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు కూడా శిక్షణ తీసుకున్నారు. కేన్సర్ కేసులను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. ప్రతి ఒక్కరూ ఈ ప్రోగ్రామ్‌లో భాగం కావాలి. ఇంటికి వచ్చే ఆరోగ్య సిబ్బందికి సహకారాన్ని అందించాలి. సిబ్బంది అడిగే సమాచారాన్ని ఇవ్వడం వల్ల ఎంతో మేలు కలుగుతుంది. సమస్యతో ఉన్న వారిని సకాలంలో గుర్తించడంతోపాటు మెరుగైన వైద్యాన్ని అందించే ఏర్పాట్లు చేస్తాం.

రాయితీ నూనెపై గందరగోళం

... 5వ పేజీ తరువాయి

నూనెలు కూడా లోకల్ బ్రాండ్లే కావడం గమనార్హం. నగర ప్రజలు ఎక్కువగా కొనే ఫ్రీడమ్, రుచి గోల్డ్, గోల్డ్ డ్రాప్, సఫోలా వంటివి లేవు. సన్‌సోలైట్ పేరు గల రిఫైన్డ్ ఆయిల్ అమ్ముతున్నారు. ఇకా పామాయిల్ అయితే 'కూల్‌పాల్' బ్రాండ్ అమ్ముతున్నారు. రిఫైన్డ్ ఆయిల్ బ్రాండ్ బయట కిలో ప్యాకెట్ రూ.132 ఉండగా అక్కడ రూ.124కి ఇస్తున్నారు. అయితే ఇవి లోకల్ బ్రాండ్ కావడంతో ఆదరణ లేదు. ఇక పామాయిల్ బయట లీటరు రూ.125 పైనే ఉంది. ఇక్కడ రూ.110కి ఇస్తున్నారు. వీటిని ఎవరూ కొనడం లేదు.

పామాయిల్ పట్టుకుపోతున్నారని క్యూఆర్ కోడ్

భాస్కర్, జిల్లా పౌరసరఫరాల అధికారి

పామాయిల్ రేటు రైతుబజార్లలో తక్కువగా ఉందని, వ్యాపారులు వచ్చి ఎక్కువ ప్యాకెట్లు తీసుకుపోతున్నారు. దానిని కట్టడి చేయడానికి క్యూఆర్ కోడ్ స్కానింగ్ పెట్టాల్సి వచ్చింది. వినియోగదారులకు అవసరమైన బ్రాండెడ్ సన్‌ఫ్లవర్ రిఫైన్డ్ ఆయిల్‌ని తక్కువ ధరకు ఇవ్వలేమని డీలర్లు చెప్పడం వల్ల లోకల్ బ్రాండ్లు విక్రయిస్తున్న మాట వాస్తవమే. ఆదరణ చూసుకొని తదుపరి చర్యలు తీసుకుంటాం.

ఇసుక స్టాకు పాయింట్లు ఏర్పాటుచేయాలి

- ఏపీపీఎస్సీ చైర్మన్‌ను నియమించాలి
- మంగళగిరి సమావేశంలో విశాఖ నేతలు



ఎన్టీఆర్ విగ్రహానికి నమస్కరిస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పక్కన సీఎం చంద్రబాబు

విశాఖపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రజలకు అందుబాటులో ఇసుక లభించేలా స్టాకు పాయింట్లు ఏర్పాటుచేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడను కోరారు. మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిల సమావేశానికి విశాఖ నుంచి పలువురు హాజరయ్యారు. పార్టీ అధ్యక్షుని హోదాలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, భీమిలి, పశ్చిమ ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పి.గణబాబు, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, పెందుర్తి, విశాఖ దక్షిణ ఇన్‌చార్జిలు గండి బాబ్జీ, సీతంరాజు సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విశాఖలో ఇసుక ఇబ్బందులపై గండి బాబ్జీ మాట్లాడారు. ఏపీపీఎస్సీ చైర్మన్‌ను వెంటనే నియమించాలని, ఉద్యోగ నియామకాలు చేపట్టేందుకు వీలుంటుందని ఎమ్మెల్యే వేపాడ చిరంజీవిరావు సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. కాగా మంత్రి లోకేశ్ విశాఖలో పర్యటిస్తున్నందున ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సమావేశానికి హాజరు కాలేదు.

ఏఐ, ఎంఎల్‌తో ఉజ్వల ఉపాధి అవకాశాలు

- ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు



చర్చా వేదికలో మాట్లాడుతున్న ఏయూ వీసీ శశిభూషణరావు

వెంకోజీపాలెం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (కృత్రిమ మేధ), మెషీన్ లెర్నింగ్ తదితర సాంకేతికతలతో భారీ వేతనాలతో ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు.

ఏపీసీటీ-వైబ్రెంట్ ఎడ్వకసి ఫర్ అడ్వాన్స్‌మెంట్ అండ్ నర్చరింగ్ ఇండియన్ లాంగ్వేజెస్ (వాణి) సహకారంతో ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏఐ, ఎంఎల్, డీఎస్‌పై తెలుగులో చర్చా వేదికను ఆయన ప్రారంభించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ 2026 నాటికి వీటి అనువర్తనాలను 75 శాతంపైగా వినియోగిస్తారన్నారు. ప్రజల్లో వీటి పట్ల విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. లక్షలాది ఉపాధి అవకాశాలను సృష్టించే శక్తి ఈ సాంకేతికతలకు ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని దేశ, విదేశీ నిపుణులతో ఏయూ, అనుబంధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లలో ఏయూ కేంద్రీయ విద్యా సంస్థలైన ఐఐటీల కంటే మెరుగైన స్థానాన్ని సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఈ విభాగం ఆచార్యులు ఆచార్య ఎం.శశి, ఐటీ విభాగాధిపతి ఆచార్య కుంజం నాగేశ్వరరావు, ఆచార్య కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పెదగదిలిలో అన్నసమారాధన



అన్నదానం ప్రారంభిస్తున్న మేయర్

ఆరిలోవ, అక్టోబరు 18 : దేవీ శరన్నవరాత్రుల లో భాగంగా పెదగదిలిలో ధూలి రఘు బ్రదర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నసమారాధన చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మేయర్ హరి వెంకటకుమారి దంపతులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ప్రతినిధులు, స్థానిక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఎల్వీపీ నేత్ర వైద్యశాల హోం సేవలకు శ్రీకారం



ఆరిలోవ, అక్టోబరు 18 : ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల యాజమాన్యం హోం అపాయ్‌మెంట్ అనే వినూత్న కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి ప్రారంభించారు. ఈ సేవలను నడవలేని వృద్ధులు ఉపయోగించుకోవచ్చని ఎల్వీపీ నేత్ర వైద్యశాలకు చెందిన వైద్యులు తెలిపారు. అపాయింట్‌మెంట్ తీసుకుంటే ఆస్పత్రి సిబ్బంది ఇంటి వద్దకు ద్విచక్రవాహనంపైవచ్చి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

వరద బాధితులకు రూ.లక్ష విరాళం

వెంకోజీపాలెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఇటీవల సంభవించిన వరదల వలన నష్టపోయిన బాధితులకు తమ వంతు సహాయాన్ని అందించేందుకు ఏయూ టీచర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ముందుకు వచ్చింది. తమ వంతు బాధ్యతగా రూ.1,04,000ల చెక్కును వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనుంజయరావుకు సొసైటీ సభ్యులు శుక్రవారం అందజేశారు.

విన్నపాల వెల్లువ

... 5వ పేజీ తరువాయి

ఇప్పించేలా చేయలంటూ మంత్రిని ఆమె కోరారు. ఇంజనీరింగ్ చదివిన తనకు ఏదైనా ఉద్యోగ అవకాశం కల్పించాలని విశాఖకు చెందిన బత్తుల దుర్గాప్రణీత్ విజ్ఞప్తి చేశారు. బీసీఏ కంప్యూటర్స్, ఎంబీఏ చదివిన తన కుమారుడికి ఉద్యోగ అవకాశం కల్పించాలంటూ విశాఖకు చెందిన అనసూరి మధుసూదనరావు మంత్రిని కోరారు. షెడ్యూల్ కులానికి చెందిన తనకు రేషన్ దుకాణం మంజూరుచేయాలని కంచరపాలెం ప్రాంతానికి చెందిన మోర్ల రాజారావు వేడుకున్నారు. ఆయా ఫిర్యాదులను పరిశీలించిన మంత్రి లోకేష్ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలను మంత్రి కలిసి ఫొటోలు, సెల్ఫీలు దిగారు.



మాట్లాడుతున్న ప్రేమ్ స్వరూప్

నేటి నుంచి డీఈఐ ఉత్పత్తుల అమ్మకాలు

విశాలాక్షినగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్‌లో వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు వ్యాపారులుగా మారి రూపొందించిన ఉత్పత్తులను ఈనెల 19, 20వ తేదీల్లో ఎంవీపీ కాలనీలోని ఉషోదయ ఫంక్షన్ హాల్‌లో అమ్మకాలు చేయనున్నట్టు ఇనిస్టిట్యూట్ అల్యూమిని ప్లేస్‌మెంట్ అసిస్టెన్స్ సెల్ (డీఈఐ - అపాక్) సౌత్‌జోన్ ఇన్‌చార్జి ఉప్పులూరి ప్రేమ్ స్వరూప్ తెలిపారు. శుక్రవారం ఆయన విశాలాక్షినగర్‌లోని దయాల్‌నగర్‌లో ఉన్న డీఈఐలో విలేకరులతో మాట్లాడారు. డీఈఐలో వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసిన 62 మంది పూర్వ విద్యార్థులు వ్యాపారులుగా మారి అనేక మందికి ఉపాధి కల్పిస్తున్నారని చెప్పారు. వారు రూపొందించిన ఉత్పత్తులను అమ్మకాల్లో పెడుతున్నామన్నారు. వీటిలో బ్లాక్ ప్రింటెడ్ చీరలు, దుప్పట్లు, దివాన్ సెట్లు, పిల్లో కవర్లు, జూట్ క్లాత్‌తో రూపొందించిన బ్యాగ్‌లు ఉన్నాయని చెప్పారు. రెండు రోజుల పాటు జరిగే ఈ అమ్మకాలు ఉదయం 10 నుంచి రాత్రి 8 వరకు ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు విశాఖ డీఈఐ ఇనిస్టిట్యూట్ ఇన్‌చార్జి దక్షణామూర్తి కూడా ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 30 మందికి జరిమానా

ఎండాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో రెండవ స్పెషల్ జ్యూడిషియల్ కోర్టు న్యాయమూర్తి 30 మందికి జరిమానా విధించారు. పీఎంపాలెం పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి. ప్రసాద్ తెలిపిన వివరాలు ప్రకారం.. స్టేషన్ పరిధిలో పీఎం పాలెం, మధురవాడ, మారికవలస ప్రాంతాల్లో పోలీసులు రెండు రోజుల పాటు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 30 మంది పై కేసు నమోదు చేశారు. శుక్రవారం వారిని కోర్టులో హాజరుపరచగా జడ్జి 30 మందికి ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున జరిమానా విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, అక్టోబరు 18 : (ఆంధ్ర జ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన,పుణ్యాహవచనము చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

సినిమా గైడ్

- **వేట్టయాన్ :** సంగం, రమాదేవి, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, లక్ష్మి (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాత (తగరపువలస)
- **విశ్వం :** మెలోడి, శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీ నరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాల పట్నం),మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **జనక అయితే గనక :** శారద, కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **మా నాన్న సూపర్‌హీరో :** గోకుల్, మౌర్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **శ్వాగ్:** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **దేవర :** జగదాంబ, శరత్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
- **సత్యం సుందరం :** శ్రీరామ

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 47, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 56, బెండకాయలు 28, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 40, బీరకాయలు 36, ఆనపకాయలు 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 32, క్యారెట్ 50 దొండకాయలు 30, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 82, అల్లం (పాతది) 100, బరబటి 38, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 85, గోరుచిక్కుడు 32, దోసకాయ 32, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 150, పొటల్స్ 66, కీరదోస 28, కాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 32, కంద 62, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	115
ఫారం ధర	135
విత్ స్కిన్	234
స్కిన్‌లెస్	250

లేగదూడలకు మరణ శాసనం

- అనారోగ్యంతో బాధపడుతున్న సంతతిని అప్పన్నకు సమర్పిస్తున్న భక్తులు
- రక్షణ చర్యలతో దేవస్థానానికి నిత్యం సమస్యలు
- ఆరోగ్యంగా ఉన్న వాటినే సమర్పించాలంటున్న అధికారులు



బక్కచిక్కిన లేగదూడలు

సింహాచలం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కోర్కెలు తీర్చే భక్తవత్సలుడుగా పేర్గాంచిన సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామికి (అప్పన్నకు) భక్తులు లేగ దూడలను మొక్కుబడిగా సమర్పించడం అనాదిగా వస్తున్న ఆచారం. ఎంతోమంది రైతులు కోడెదూడలను ఏడాది పొడవునా స్వామికి సమర్పిస్తుంటారు. వీటిని దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే పశుపోషణ కేంద్రాల్లో సాకుతుంటారు. అయితే పాలు వదలని దూడలు, విదేశీ సంతతి, అనారోగ్యంతో బాధపడుతున్న వాటిని స్వామికి సమర్పిస్తుండడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. కొన్ని ప్రాణాలు కోల్పోతుండడంతో దేవస్థానం అధికారులు విమర్శలు ఎదుర్కొంటున్నారు.

సూచనలు చేస్తున్నా...

లేగ దూడలను సమర్పించే భక్తులకు దేవస్థానం అధికారులు ఏళ్లుగా అనేక సూచనలు చేస్తున్నారు. పూర్తిగా దేశీయ సంతతి దూడలను, ఆరోగ్యంగా ఉన్నవి, పూర్తిగా పాలు వదిలేసినవి మాత్రమే దేవస్థానానికి అందజేయాలని సూచిస్తున్నారు. అయినప్పటికీ భక్తులు పట్టించుకోవడం లేదు. దీంతో అనేక సమస్యలు చుట్టుముడుతున్నాయని వాపోతున్నారు. ఉత్తరాంధ్రకు చెందిన గ్రామీణ భక్తులు వరాహనరసింహుని సింహాద్రి అప్పన్నగా పిలుచుకుంటారు. ఇలవేల్పుగా భావిస్తూ స్వామికి ఆవు దూడలను మొక్కుగా సమర్పిస్తుంటారు. దేవుడికి భక్తితో ఇచ్చే గోసంతతి విషయంలో భక్తి మాటెలా ఉన్నా తమకు వ్యవసాయానికి లేదా, పాల ఉత్పత్తికి పనికిరాని వాటిని, విదేశీ సంతతికి చెందిన దూడలను ఇస్తున్నారు. వాటికితోడు అధిక శాతం మంది భక్తులు తల్లి పాలను తాగే లేగ దూడలను విడిచిపెడుతుండడంతో అవి పాలు అందక శుష్కించి ప్రాణాలు కోల్పోతున్నాయి. కొందరు తమకు పనిరాని, బక్కచిక్కిన దూడలను, అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న వాటిని సమర్పించేస్తున్నారు. దేవస్థానం అధికారులు ప్రచారం చేసినా, మార్పు లేదు. స్వదేశీ గోసంతతికి చెందిన కోడె, లేగదూడలను మాత్రమే సమర్పించాలని హెచ్చరిస్తున్నా పెడచెవిన పెడుతున్నారు.



గాయంతో ఉన్న దూడ

పట్టించుకోని త్రిసభ్య కమిటీ

కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ (దేవదాయ శాఖ, పశుసంవర్ధక శాఖ, స్వచ్ఛంద సంస్థ) సభ్యులు ఈ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాల్సి ఉన్నా, భక్తులు ప్రతి శనివారం అధికంగా దూడలు సమర్పించే సమయంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మాత్రమే కనిపిస్తున్నారు. నిష్ఫలమైన దూడలను సమర్పిస్తుండడంతో వీఎస్‌పీసీఏ ప్రతినిధులు కొన్ని నిబంధనలు అమలు చేస్తూ గిరిజన రైతులకు దత్తత పేరుతో పంపిణీ చేస్తున్నారు.వాటిలో అత్యధిక శాతం మృతి చెందుతుండగా, మరికొన్ని దళారులు కబేళాకు తరలిస్తున్నారు.

ఈ సమస్యలకు పరిష్కారంగా స్వదేశీ గోసంతతిని, పూర్తి ఆరోగ్యంతో ఉన్నవి భక్తులు సమర్పించాలని కోరుతున్నారు. కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారించి గ్రామస్థాయిలో సచివాలయ వ్యవస్థల ద్వారా విస్తృత ప్రచారం కల్పించేలా చూడాలంటున్నారు. భక్తులు గోసంతతికి బదులుగా తామ్రం, రజితం, స్వర్ణంతో చేసిన గోవుల ప్రతిమలను దేవస్థానం హుండీలలో సమర్పించడం ద్వారా తమ మొక్కులు తీర్చుకోవాలంటున్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న అనకాపల్లి జిల్లా ఎస్పీ దీపికా పాటిల్

పోలీసుల రక్తదానం

విశాలాక్షినగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కైలాసగిరిలో ఉన్న జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని అనకాపల్లి జిల్లా ఎస్పీ ఎం. దీపికా పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్న వారంతా సామాజిక బాధ్యతగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదాన శిబిరాలు మరొకరి ప్రాణాలను కాపాడటానికి దోహదపడతాయని చెప్పారు. అనంతరం రక్తదానం చేసిన పోలీసు అధికారులను,సిబ్బందిని ఆమె అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. అంతకముందు ఎన్‌టీఆర్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం. దేవప్రసాద్, ఎల్. మోహన్‌రావు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, బాల సూర్యారావు, మన్మథరావు, సతీశ్, నరసింహమూర్తి సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా, డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ

మధురవాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు వాంబేకాలనీ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో మలేరియా, డెంగీ జ్వరాల నివారణపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ సుస్మిత మాట్లాడుతూ విష జ్వరాలకు ప్రధాన కారణం దోమలేనని, వాటిని నివారిస్తే వ్యాధులకు దూరంగా ఉండొచ్చని చెప్పారు. దోమల నివారణకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఇళ్లల్లో కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఇంట్లో వేపాకుల పొగ వేయడంతో పాటు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని తెలిపారు. అలాగే ఇళ్లల్లో ప్లాస్టిక్ బాటిళ్లు, పూల కుండీల్లో నీరు నిల్వ లకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాము నాయుడు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్పీ డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్



భీమిలి : శిక్షణలో పాల్గొన్న వార్డు సభ్యులు

గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం

పద్మనాభం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పంచాయతీల పాలకులు ప్రాధాన్యత ఇవ్వాలని జడ్పీ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి కె. రాజ్‌కుమార్ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం కూడా ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పాలకులు ప్రజల అవసరాలను గుర్తించి, అవసరమైన ప్రణాళికలను రూపొందించుకోవాలని చెప్పారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్లు, రహదారులు, కాలువలు వంటి సదుపాయాలు సమకూర్చాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ కె. రాంబాబు, ఎంపీడీఓ విజయకుమార్, ఈఓఆర్డీ మీనాకుమారి, ఏఓ జయ ఉమ తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : భీమిలి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శుక్రవారం కూడా శిక్షణ ఇచ్చారు. పంచాయతీల నిర్వహణ, ఖర్చులు వంటి అంశాలపై సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ హనుమంతరావు, ఈఓపీఆర్‌డీ రమేష్‌నాయుడు మాట్లాడుతూ పంచాయతీ పాలకులు గ్రామాల అభివృద్ధిపై దృష్టిసారించాలన్నారు.



నిరుపయోగంగా ఉన్న కుళాయిలు

అపరిశుభ్రత మధ్య 'జల ప్రసాదం'

సింహాచలం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : సింహగిరి బస్టాండ్‌లో భక్తుల దాహార్తి తీర్చేందుకు దివీస్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన జల ప్రసాదం చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. ప్రస్తుతం ఇక్కడి కుళాయిలు పని చేయకపోగా పరిసరాలన్నీ చెత్తచెదారంతో నిండిపోయాయి. దీంతో దాత ఆశయం నెరవేరకపోగా భక్తులకు తాగునీటి అవస్థలు షరా మామూలుగా మిగిలాయి.



మంత్రి లోకేశ్‌కు చెక్కు అందిస్తున్న వీసీ శశిభూషణరావు, తదితరులు

సీఎం సహాయ నిధికి రూ.79.95 లక్షలు విరాళం

- మంత్రి లోకేశ్‌కు అందించిన ఏయూ వీసీ, రిజిస్ట్రార్

విశాఖపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి ఏయూ నుంచి రూ.79,95,116 విరాళం అందించారు. నగరానికి వచ్చిన మంత్రి నారా లోకేశ్ ను కలిసి ఏయూ వీసీ జి. శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఇఎన్ ధనుంజయరావు శుక్రవారం కలిసి చెక్కును అందించారు. వర్సిటీలోని బోధన, బోధనేతర ఉద్యోగులు, పెన్షనర్లు స్వచ్ఛందంగా విరాళాలు అందించినట్టు వారు మంత్రికి వివరించారు. ఏయూ అనుబంధ కాలేజీలు నుంచి మరో రూ. 40 నుంచి రూ.50 లక్షలు అందిస్తామని తెలియజేశారు. మంత్రి వర్సిటీ అధికారులను అభినందించారు.



నగరంలో శుక్రవారం భిన్న వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండగా, మధ్యాహ్నం మబ్బులు కమ్మి, చల్లటి గాలులు వీచాయి. మధురవాడలోని మిథిలాపురి ఉడా కాలనీ వద్ద నీలాకాశంలో కనిపించిన వెండి మబ్బుల దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

విద్యుత్ చార్జీల పెంపుపై సీపీఎం ధర్నా



చిట్టివలస ఏఈకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తగరపువలస, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకవైపు నిత్యావసర సరకుల ధరలు విపరీతంగాపెరిగిపోయిన పరిస్థితుల్లో విద్యుత్ చార్జీల భారం ప్రజలను మరిన్ని ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ప్రభుత్వం తక్షణమే ట్రూ అప్ చార్జీలను వేసే విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఈకి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జోన్ కమిటీ నాయకులు మూర్తి, ఎస్. అప్పలనాయుడు, ఆర్. నరసింగరావు, కె.నాగరాణి, పి. సూర్యనారాయణ, ఎస్. రాము డి. రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ధరల పెంపు పట్ల సీపీఐ నిరసన

అడ్డూఅదుపు లేకుండా పెరిగిపోతున్న నిత్యావసర సరకుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు తగరపువలసలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజుల్లోనే నిత్యావసర సరకుల ధరలు పెరిగిపోయి సామాన్యులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు.ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యదర్శి కొండపు ఈశ్వరరావు, సీపీఐ ఏరియా కార్యదర్శి కానూరి రాంబాబు, చిల్ల నరసింహులు, రాంపైడి, మోర అప్పలరాజు, నూలు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐశ్వర్య వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు



భీమునిపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఐశ్వర్య వెంకటేశ్వరస్వామి ఆలయంలో తిరు పవిత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామివారిని మేల్కొలిపి ప్రభాతరాధనలు పూర్తి చేశారు. అనంతరం మహిళలు సామూహిక వ్రతాలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు సూర్యనారాయణమూర్తి, రామచంద్రమూర్తి, బానోజీరాజు పాల్గొన్నారు.



బాలికలతో మాట్లాడుతున్న సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ఎండాడ, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) : ఎండాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను లీగల్ సర్వీసెస్ అధికారిణి, సీనియర్ డివిజన్ బెంచ్ సివిల్ జడ్జి ఎం. వెంకటశేషమ్మ శుక్రవారం సందర్శించారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన వంట శాల, స్టాక్ రూమ్‌ను పరిశీలించారు. భోజనానికి సంబంధించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అలాగే భోజనం రుచి ఎలా ఉందని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో పరిశుభ్రతకు ప్రాధాన్యతమివ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆమెతో పాటు పాఠశాల హెచ్ఎం వానపల్లి శైలజ, ఉపాధ్యాయులు ఉన్నారు.

సహాయ సిటీ ప్లానర్‌గా తిరుపతిరావు

భీమునిపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జోనల్ కార్యాలయంలో సహాయ సిటీ ప్లానర్‌గా ఎం. తిరుపతిరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ పని చేసిన శ్రీనివాసరావును ఏలూరు బదిలీ చేశారు.

ఫుట్‌పాత్‌పై పొంచి ఉన్న ప్రమాదం



ఫుట్‌పాత్‌పై ఏర్పడిన గొయ్యి

మధురవాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ పరిసరాల్లో సర్వీసు రోడ్డుకు ఆనుకొని ఉన్న ఫుట్‌పాత్‌లు ప్రమాదకరంగా ఉన్నాయి. కొన్నిచోట్ల సిమ్మెంటు పలకలు విరిగిపోగా, మరికొన్ని చోట్ల గోతులు ఏర్పడ్డాయి. దీంతో పాదచారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. శిల్పారామం సమీపంలో ఫుట్‌పాత్‌పై పెద్ద గొయ్యి ఏర్పడడంతో కొందరు దాన్ని తాటి కమ్మతో కప్పారు. ఇప్పటికే ఇక్కడ పలువురు గాయపడిన సంఘటనలు ఉన్నాయి. అధికారులు తక్షణమే స్పందించి ఫుట్‌పాత్‌లపై సిమ్మెంటు పలకలను సరి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఏఎంసీ మాజీ చైర్మన్‌ను పరామర్శించిన ముత్తంశెట్టి

భీమునిపట్నం రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తాళ్లవలస గ్రామానికి చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ సూర్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతుండడంతో మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం ఆయన్ను పరామర్శించారు. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.



సూర్యనారాయణతో మాట్లాడుతున్న ముత్తంశెట్టి



తిరువీధిలో ఉభయ దేవేరులతో స్వామివారు

వైభవంగా సంక్రమణ తిరువీధి ఉత్సవం

సింహాచలం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : తులా సంక్రమణాన్ని పురస్కరించుకుని వరాహలక్ష్మీనృసింహస్వామి తిరువీధి ఉత్సవం శుక్రవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరలను స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి, పల్లకిలో ఉంచారు. ఆస్థాన విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల పారాయణాల నడుమ తిరువీధి జరిపారు. మార్గం పొడవునా భక్తులు ఫలాల నివేదనలు ఇచ్చారు.

'పల్లె పండుగ'లో రోడ్ల పనులకు శంకుస్థాపన

పద్మనాభం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రోడ్ల నిర్మాణానికి నాయకులు శుక్రవారం శంకుస్థాపన చేశారు. పాండ్రంగి గ్రామంలో రూ.15లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, కాలువల నిర్మాణానికి టీడీపీ నాయకుడు కె. రామరాజు భూమి పూజ చేయగా పొట్నూరులో టీడీపీ సీనియర్ నాయకులు ఎం. నందీశ్వరరావు, ఎం. శ్రీను సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే గంధవరం, తునివలస గ్రామాల్లో కూడా నాయకులు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో పాండ్రంగి ఒకటో వార్డు సభ్యుడు మహంతి అప్పలరమణ, కూటమి నాయకులు మహేశ్, వెంకటరావు, కొసర అప్పలనాయుడు, పిన్నింటి రమణ, సారథి, గణేశ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

'డైట్'లో భీమిలి చారిత్రక ఫొటోల ప్రదర్శన

భీమునిపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డైట్ కళాశాలలో భీమిలి చారిత్రక అంశాలను గోడ పత్రికల ద్వారా శుక్రవారం ప్రదర్శించారు. పీఎంశ్రీ పథకంలో భాగంగా ఎంపిక చేసిన చిట్టివలస జెడ్‌పీ ఉన్నత పాఠశాల, రేవిడి (పద్మనాభం), ఆనందపురం హైస్కూల్, రైల్వే స్కూల్ (విశాఖ), పెందుర్తి పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు వీటిని ప్రదర్శించారు. క్విజ్, డిబేట్, సామాజిక సమస్యలు, చారిత్రక ప్రాధాన్యతా అంశాల విభాగాల్లో వీటిని తయారు చేసి ప్రదర్శించారు. చిట్టివలస విద్యార్థులు భీమిలి చరిత్రను తెలియజేసే అరుదైన ఫొటోలతో గోడపత్రికలను ప్రదర్శించారు.

వివాహిత మృతిపై ఆందోళన

ఎండాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పీఎంపాలెం కారుషెడ్ కూడలిలో ఉన్న ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం వికటించి వివాహిత మృతి చెందింది. దీంతో ఆమె బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. గుంటూరు జిల్లా రొంపిచర్ల మండలం విప్పరపల్లికి చెందిన డి. నరేశ్ చిప్పాడ దివీస్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన తన భార్య అనురాధ (29)తో కలిసి తగరపువలసలో నివాసం ఉంటున్నాడు. సంతానం లేకపోవడంతో మూడేళ్లుగా వారు కారుషెడ్ సమీపంలో ఉన్న కీర్తన ఆసుపత్రి వైద్యురాలు పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం ఉదయం వివాహిత గర్భ సంచికి సంబంధించి వైద్యురాలు ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేశారు. సాయంత్రం పరిస్థితి విషమం కావడంతో ఆసుపత్రి సిబ్బంది ఆమెను నగరంలోని మరో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందింది. వైద్యురాలి నిర్లక్ష్యం వల్లే తన భార్య మృతి చెందిందని భర్తతో పాటు కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చేరుకుని ఆం దోళనకు దిగారు. పీఎంపాలెం పోలీసులు ఆసుపత్రి వద్దకు చేరుకుని వారిని అక్కడి నుంచి పంపించారు. బాధితులు ఎటువంటి ఫిర్యాదు చేయలేదని సీఐ బాలకృష్ణ తెలిపారు.

దివ్యాంగుల టీ 20 టోర్నీలో ఆంధ్ర జట్టు విజయం

విశాఖపట్నం (స్పోర్ట్స్), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ దివ్యాంగుల టీ20 టోర్నీలో భాగంగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర 146 పరుగుల తేడాతో బరోడాపై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్ర నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లకు 220 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో బరోడా 17.2 ఓవర్లలో 74 పరుగులకు కుప్పకూలింది. సయ్యద్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

శిల్పారామం ఏఓపై అంతర్గత విచారణ?

మధురవాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మధురవాడ శిల్పారామం పరిపాలనాధికారిపై శాఖాపరమైన విచారణ జరుగుతున్నట్టు తెలిసింది. కార్యాలయంలో పనిచేస్తున్న మహిళ ఏఓ తనను వేధింపులకు గురిచేస్తున్నారని, 20 రోజుల కిందట ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు అధికారులు అంతర్గత విచారణ ప్రారంభించినట్టు తెలిసింది. నాలుగు నెలల సీసీ టీవీ ఫుటేజీలు పరిశీలించడంతో పాటు ఏఓ నుంచి పలు కోణా ల్లో వివరాలు సేకరించారు. మరోవైపు జిల్లా స్థాయి ఉన్నతాధికారులు కూడా విచారణ ప్రారంభించినట్టు సమాచారం.





యూట్యూబ్ కుర్రోళ్లు

గిరిజన ఆచార సంప్రదాయాలు, పెళ్లిళ్లు, పండగలు, వంటకాలపై 'అరకు ట్రైబల్ కల్చర్' పేరుతో ప్రత్యేక వీడియోలు


ప్రకృతిలో పానీపూరి తయారు చేస్తున్న వీడియోను తీస్తున్న అరకు ట్రైబల్ కల్చర్ యూట్యూబ్ ఛానెల్ యువకులు

ఓ స్నేహితుడి సలహా ఆ యువకుడి జీవితాన్నే మార్చేసింది. టీవీ ఛానెళ్లకు ఇంటర్వ్యూలు ఇచ్చే స్థాయికి తీసుకువెళ్లింది. అతనితో పాటు ఉన్నవారికి కూడా గుర్తింపు తెచ్చి పెట్టింది. గిరిజన సంస్కృతీ, సంప్రదాయాలను కళ్లకు కట్టినట్టు చూపిస్తూ 5.28 లక్షల మంది సబ్‌స్క్రైబర్లను సొంతం చేసుకున్న 'అరకు ట్రైబల్ కల్చర్' యూట్యూబర్స్‌పై ప్రత్యేక కథనం... ● అనంతగిరి, ఆంధ్రజ్యోతి

- ఇప్పటి వరకు 399 వీడియోలు అప్‌లోడ్, 5.28 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు
- వచ్చిన ఆదాయంతో సేవా కార్యక్రమాలు
- హేళన చేసిన వారి నుంచే ప్రశంసలు పొందిన అనంతగిరి యువకులు

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం ఎగువశోభ పంచాయతీ దండబాబు గ్రామానికి చెందిన రాము బీఈడీ పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నంలో ఉండేవాడు. ఆ సమయంలో అతని స్నేహితుడు భీమన్న ఓ సలహా ఇచ్చాడు. ఒడిశాలో ఓ యువకుడు యూట్యూబ్ ఛానెల్ పెట్టి అక్కడి సంస్కృతి, గొప్పతనాన్ని చక్కగా చూపిస్తున్నాడని, అలా నువ్వెందుకు చేయకూడదని రామును ప్రశ్నించాడు. ఆ ఆలోచన రాముకు నచ్చి 2021 నవంబరు 8వ తేదీన 'అరకు ట్రైబల్ కల్చర్' పేరుతో యూట్యూబ్ ఛానెల్ పెట్టాడు. అనంతగిరి పంచాయతీ రాజుపాక గ్రామానికి చెందిన రాజు, గణేశ్, చిన్నారావు, లక్ష్మణ్‌లతో బృందంగా ఏర్పడి వీడియోలు తీయడం ప్రారంభించాడు.

హేళన చేసిన వారే మెచ్చుకుంటున్నారు

యూట్యూబ్ ఛానెల్ ప్రారంభించిన కొత్తలో వీడియోలు తీస్తుంటే గ్రామస్థులు ఆ యువకులను హేళన చేసేవారు. బుద్ధిగా చదువుకోక మీకెందుకురా వీడియోలు అంటూ ప్రశ్నించేవాళ్లు. వారిని చూసి మిగతా వాళ్లు పాడైపోవద్దని చులకనగా మాట్లాడేవారు. అయితే...ఏడాదిలో గ్రామస్థుల్లో పరివర్తన వచ్చింది. ఆ యువకులను పొగడ్తలతో ముంచెత్తుతున్నారు.


నిరుపేదలకు రగ్గులు పంపిణీ చేస్తున్న రాము

గిరిజనుల జీవన విధానాన్ని ప్రతిబింబిస్తూ..

మైదాన ప్రాంత ప్రజలతో పోలిస్తే గిరిజన ప్రాంతంలోని వారి జీవన విధానం వినూత్నంగా ఉంటుంది. ఆహారపు అలవాట్లు, కట్టుబాట్లు, పండగలు, పెళ్లిళ్లు, ఆచార సంప్రదాయాలు విభిన్నంగా ఉంటాయి. గిరిజన ప్రాంతంలో బొండ, కోందు, పీవీటీజీ, నూకదొర, కొండదొర, భగత, తదితర గిరిజన జాతుల రోజువారీ జీవన విధానం గురించి చాలామందికి ఇప్పటికీ తెలియదు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఈ ప్రాంత గొప్పతనాన్ని బాహ్య ప్రపంచానికి తెలియజేయాలని ఈ బృందం నిర్ణయించుకుంది. ముందుగా బొడ్డెంగి పురుగులతో వంట చేసే విధానాన్ని వీడియో తీసి యూట్యూబ్ ఛానెల్‌లో అప్‌లోడ్ చేయడంతో వీరి ప్రయాణం మొదలైంది. తరువాత దట్టమైన అటవీ ప్రాంతంలో ఈత దుంపల సేకరణ, వండుకునే విధానం, పూర్వీకులు ఆముదం పిక్కలు, కానుగ పిక్కలను సేకరించి నూనెను ఎలా తయారుచేసుకునేవారు అనే దానిపై వీడియోలు చిత్రీకరించారు. గిరిజనుల పెళ్లిళ్లు, పండుగలు, వారపు సంతల్లో అటవీ ఉత్పత్తుల విక్రయాలు, అటవీ ప్రాంతంలో దొరికే పండ్లు తదితర వాటిపై వీడియోలు చేశారు. పర్యాటక ప్రాంతాల పరిచయం చేయడం, అరకులోయ సమీపాన మాడగడ వ్యూపాయింట్, అనంతగిరి చిట్టంపాడు జలపాతం, చింతపల్లి, లంబసింగి ప్రత్యేకతలను వీడియోలు తీసి పర్యాటకుల మదిలో స్థానం సంపాదించుకున్నారు. మొదట్లో వంద మందితో మొదలై ఇప్పుడు 5.28 లక్షల మంది సబ్‌స్క్రైబర్లను సొంతం చేసుకున్నారు.

స్నేహితుడి సలహాతో..

నా స్నేహితుడు భీమన్న సలహాతోనే ఈ యూట్యూబ్ ఛానెల్ పెట్టాను. గిరిజన ప్రాంతం గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పే విధంగా గిరిజన ఆచార సంప్రదాయాలపై వీడియోలు చేస్తున్నాం. యూట్యూబ్‌కు మంచి పేరు వచ్చింది..ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు.



- రాము, యూట్యూబర్

ఆదాయంతో సేవా కార్యక్రమాలు

అరకు ట్రైబల్ కల్చర్ యూట్యూబ్ ఛానెల్ విశేష ఆదరణ పొంది ఆ యువకులకు ఆదాయాన్ని తెచ్చిపెడుతోంది. యూట్యూబ్ ఛానెల్‌కు పేరు వచ్చిన తరువాత మొదట అందుకున్న నగదు ప్రోత్సాహకం రూ.1.4 లక్షలు. ఆ తరువాత నుంచి ప్రతి నెలా రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఆదాయం వస్తోంది. దీంతో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవంతో పాటు పలు పర్వదినాల్లో వృద్ధులకు రగ్గులు, గిరిజన మహిళలకు చీరలు, నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్నారు.

నగరంలో మంత్రి లోకేశ్ బిజీబిజీ


కోర్టు బయట అభిమానులు, నేతలకు అభివాదం చేస్తున్న మంత్రి లోకేశ్


న్యాయవాదుల సమస్యలను నోట్ చేసుకుంటున్న మంత్రి లోకేశ్


ప్రజా దర్బార్‌లో చిన్నారిని ఎత్తుకున్న మంత్రి లోకేశ్

విశాఖపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఐటీ, మానవవనరుల శాఖామంత్రి నారా లోకేశ్ శుక్రవారం నగరంలో రోజంతా బిజీగా గడిపారు. పరువు నష్టం కేసులో విచారణకు వచ్చిన ఆయన పార్టీ కార్యాలయంలోనే బసచేశారు. ప్రజాదర్బార్ నిర్వహించి, వినతులు స్వీకరించారు. ఎంపీ శ్రీభరత్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, హౌసింగ్‌బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, నేతలు బుద్దా నాగజగదీశ్వరరావు, కిడారి శ్రావణ్‌కుమార్, మహ్మద్ నజీర్, దాడి రత్నాకర్, పీవీజీ.కుమార్, కోరాడ రాజబాబు, పీలా శ్రీనివాసరావు, గొంప కృష్ణ, గండి వంశీ లోకేశ్‌ను కలిశారు. ఆయనతోపాటు కోర్టుకు వెళ్లారు. సాయంత్రం కోర్టు నుంచి తిరిగి పార్టీ కార్యాలయానికి చేరుకున్న లోకేశ్‌ను దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ఏయూ ఆచార్యులు కలిశారు. శనివారం ఉదయం నగరం లేదా గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ విద్యా సంస్థలను మంత్రి ఆకస్మికంగా తనిఖీచేయనున్నారు. ఈ పర్యటన వివరాలను గోప్యంగా ఉంచారు.

డిజిటల్ మార్కెటింగ్ విధానాలు ప్రోత్సహించాలి

మహరాణిపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పారిశ్రామిక వేత్తలు, ఇతర ఉత్పత్తిదారులు డిజిటల్ మార్కెటింగ్ విధానాలు అనుసరించి, మరిన్ని ప్రయోజనాలు పొందాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా పారిశ్రామిక ఉత్పత్తులు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన 'ఓపెన్ నెట్‌వర్కు ఫర్ డిజిటల్ కామర్స్ ప్లాట్‌ఫాం'లో అందరూ చేరాలని కోరారు. ఈ కామర్సు విధానాలకు పెద్దపీట వేస్తూ అమ్మకందారులకు, కొనుగోలుదారులకు ఇది మంచి వేదికగా నిలుస్తుందని పేర్కొన్న ఆయన, ఇప్పటికే అందుబాటులో ఉన్న యాప్‌ల ద్వారా ఎన్నో ప్రయోజనాలు కలుగుతున్నాయని తెలిపారు. పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చేవారికి అన్ని విధాలా సహకరించాలని అధికారులకు సూచించారు. భూసేకరణకు సంబంధించి సాంకేతిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డీవో శ్రీలేఖ, జీఎంపీ ఆదిశేషు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

రైల్వేస్టేషన్‌లో 12.8 కిలోల గంజాయి పట్టివేత

విశాఖపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.64 వేలు విలువ చేసే 12.8 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. శుక్రవారం జీఆర్పీ ఎస్‌ఐ శాంతారాం, ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ జూలీ కర్మాకర్ తమ సిబ్బందితో ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఉత్తరప్రదేశ్‌లోని నొయిడాకు చెందిన అనూజ్‌కుమార్, ఇందర్ భూషణ్, మహ్మద్ సరేక్ అనే నిందితులు గంజాయి రవాణా చేస్తున్నట్టు గుర్తించి పట్టుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపరచగా నిందితులకు రిమాండ్ విధించారని రైల్వే పోలీసులు తెలిపారు.

'నిర్లక్ష్యంతోనే క్రేన్ ప్రమాదం'

విశాఖపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యం కారణంగానే నేవల్ డాక్‌యార్డు జంక్షన్ సమీపాన శుక్రవారం క్రేన్ ప్రమాదం జరిగిందని విశాఖపట్నం హెవీ క్రేన్ ఓనర్ల సంఘం ఆరోపించింది. దీనికి కాంట్రాక్టర్, కంపెనీ భద్రతా అధికారులే బాధ్యులని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. అతి పెద్ద ప్రక్రియ చేపడుతున్నపుడు కాంట్రాక్టర్ ఆ స్థలంలో లేరని, అనుభవం లేని సూపర్‌వైజర్‌ను ఉంచారన్నారు. క్రేన్‌తో ఎత్తాల్సిన పైపుల బరువు ఎంతో వారు కచ్చితంగా చెప్పలేదని, భారీ వర్షం కురుస్తున్న సమయంలో ఇలాంటి పనులు చేపట్టకూడదని వివరించారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గుణుపూర్, రూర్కెలా మధ్య నడుస్తున్న రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ రైళ్ల సర్వీసులకు (18117/ 18118), రూర్కెలా, జగదల్‌పూర్ మధ్య నడిచే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు (18107/18108) ఈ నెల 20, 21, 22 తేదీల్లో స్లీపర్ క్లాసు కోచ్‌ను జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం ఆమోదం

వెంకోజీపాలెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు జీవీఎంసీ స్థాయీ సంఘం ఆమోదం తెలిపిందని చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘం సమావేశ మందిరంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమావేశంలో 85 అంశాలను పొందుపరిచారని, వాటిని సభ్యులు చర్చించి ఎనిమిది అంశాలు వాయిదా వేయగా, 1,2 అంశాలు గతంలో వాయిదా వేసినందున వాటిని కౌన్సిల్ సమావేశంలో పొందుపరుస్తామన్నారు. మూడో అంశం గత సమావేశంలో ఆమోదం పొందడంతో ఉపసంహరించామన్నారు. మిగిలిన 74 అంశాలు ఆమోదం పొందాయన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో రూ.6.04 కోట్లు, ప్రజారోగ్య విభాగంలో రూ.2.45 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సభ్యులు ఆమోదం తెలిపారన్నారు. సమావేశంలో జీవీఎంసీ కార్యదర్శి బీవీరమణ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

సింహాచలం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహ స్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆర్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాధాశ్యామ్ రాథో, కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ మధుసూదనరెడ్డి, రాజకీయ విశ్లేషకుడు రవికుమార్, ఏపీ ఈపీ డీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు, హీరో జూ. ఎన్టీఆర్ తల్లి షాలినీ ఉన్నారు. వారికి ఈఓ వేండ్ర త్రినాథరావు, ఏఈఓ ఆనందకుమార్ ఆహ్వానం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న వారి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా అధికారులు శాలువతో సత్కరించి స్వామివారి ఫొటో, ప్రసాదాలను అందజేశారు.



కప్పస్తంభం వద్ద ఆర్‌బీఐ ఈడీ రాధాశ్యామ్ రాథో, జూ. ఎన్టీఆర్ తల్లి

విరబూసిన బ్రహ్మ కమలం



కూర్మన్నపాలెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కణితి కాళింగుల వీధిలో శుక్రవారం రాత్రి ఉక్కు ఉద్యోగి దుగ్గపు రవి ఇంట్లో శుక్రవారం బ్రహ్మ కమలం విరబూసింది. కశ్మీర్ ప్రాంతంలో మండు వేసవిలో విరబూసే ఈ పుష్పం తమ ఇంట్లో పూయడంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. పుష్పాన్ని శ్రీవారికి సమర్పిస్తామన్నారు.

జాతీయ వెయిట్ లిఫ్టింగ్‌లో తరుణ్‌కు రజత పతకం



విశాఖపట్నం (స్పోర్ట్స్), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన ఎం.తరుణ్ రజత పతకం సాధించాడు. హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన ఈ టోర్నీ 81 కిలోల విభాగంలో ప్రాతినిధ్యం వహించిన తరుణ్ ప్రతిభ కనబరిచి రజత పతకం సొంతం చేసుకున్నాడు. బుల్లయ్య కళాశాల విద్యార్థి అయిన తరుణ్‌ను యాజమాన్య ప్రతినిధులు డాక్టర్ మధుకుమార్, చక్రవర్తి, డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ఎస్.లక్ష్మణరెడ్డి, గంగా భవానీ తదితరులు అభినందించారు.

మైగ్రేన్ తలనొప్పి పట్ల అప్రమత్తత అవసరం

- ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ న్యూరాలజీ జాతీయ అధ్యక్షుడు దేబాశిష్ చౌదరి


డాక్టర్ దేబాశిష్ చౌదరిని సత్కరిస్తున్న నిర్వాహకులు

విశాఖపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మైగ్రేన్ తలనొప్పి పట్ల అప్రమత్తత తో వ్యవహరించాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ న్యూరాలజీ జాతీయ అధ్యక్షుడు దేబాశిష్ చౌదరి పేర్కొన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో నోవాటెల్‌లో జరుగుతున్న న్యూరాలజీ వైద్యుల జాతీయ సదస్సులో మూడో రోజు ఆయన ప్రసంగించారు. మైగ్రేన్ తలనొప్పితో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని, దీనిపట్ల చాలా మందికి అవగాహన లేదన్నారు. సకాలంలో సమస్యను గుర్తించి మెరుగైన వైద్య సేవలు పొందడం ద్వారా ఉపశమనం పొందవచ్చన్నారు. మరో ఆరు హాల్స్‌లో జరిగిన సెషన్స్‌లో విభిన్న అంశాలపై వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వైద్యులు ప్రసంగించారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ బుచ్చిరాజు, డాక్టర్ గోపి, డాక్టర్ భాగ్యలక్ష్మి, ప్రముఖ వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మెకు ఉక్కు కాంట్రాక్టు కార్మికులు దూరం

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణతో పాటు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న స్టీల్‌ప్లాంట్‌లో తలపెట్టనున్న కార్మికసమ్మెకు కాంట్రాక్టు కార్మికులు దూరంగా ఉన్నారు. గతంలో ఒక రోజు ఉద్యోగ సంఘాలు, ఆ తరువాత కాంట్రాక్టు కార్మిక సంఘాలు నోటీసు ఇచ్చేవి. ఈ సారి ఉద్యోగ సంఘాలు మాత్రమే నోటీసు ఇచ్చాయి. గతంలో నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికులు సమ్మెలో పాల్గొనేవారు. అధికారుల విధులు నిర్వహించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించటం లేదు. కేవలం ఎన్‌జేసీఎస్ సంఘాలు మాత్రమే సమ్మె నోటీసు ఇచ్చాయని, తాము పాల్గొనేది లేదని నాన్ ఎన్‌జేసీఎస్ సంఘాలు పేర్కొన్నాయి. ఇదిలావుండగా ఉద్యోగ సంఘాలు ఈ నెల 28న సమ్మె చేయనున్న నేపథ్యంలో వారికి మద్దతుగా బహిరంగ సభ నిర్వహిస్తామని కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు పేర్కొన్నారు.

ఆర్టీసీ ఆర్ఎంగా అప్పలనాయుడు



ద్వారకాబస్‌స్టేషన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌గా విజయనగరం జోన్ డిప్యూటీ చీఫ్‌ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్ అండ్ ఆపరేషన్స్)గా బిఅప్పలనాయుడు శుక్రవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఆర్ఎం అందవరపు అప్పలరాజు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. దీంతో అప్పలనాయుడుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. జిల్లాలో వివిధ డిపోల్లో మేనేజర్‌గా, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీరుగా, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్‌గా అప్పలనాయుడు పనిచేశారు.

ఆర్టీసీలో అప్రంటిస్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

ద్వారకాబస్‌స్టేషన్, అక్టోబరు 18: ఆర్టీసీలో వివిధ ట్రేడుల్లో అప్రంటిస్‌షిప్‌లు చేసేందుకు అర్హులైన ఐటీఐ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నది. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు www.aprenticeship.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 31 లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాబిందు ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తు చేసుకున్న విశాఖ, అనకాపల్లి జిల్లాల అభ్యర్థులకు 6న, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల వారికి 7న, కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల వారికి 8న ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు. దరఖాస్తు, అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్లతో విజయనగరం జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలకు హాజరు కావాలని కోరారు.